నేటి కందం- నేటికి అందం

నీతిగ మణిపూరున గల
జాతుల గొడవలను మాన్పి సముదాయింపన్
నేతగ వై కే సింగును
ప్రీతిగ నియమించి నంత-ప్రేమలు విరిసెన్ !!

(కలహించుకుంటున్న రెండు జాతుల నుండీ ఒక్కొక్క ఉప ముఖ్యమంత్రితో మణిపూర్ లో వై కే సింగ్ ముఖ్యమంత్రి గా ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేయడం వలన జాతుల మధ్య విభేదాలు తగ్గి మరలా ప్రేమలు విరియడంతో ఆ రాష్ట్ర ప్రజలు సంతోషిస్తున్నారు రాష్ట్రం అభివృద్ధి పథం లో నడుస్తుంది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    E-mail:netinijam93@gmail.com

చురక

ప్రైవేటులో అభివృద్ధి
ప్రజలకేమి ఒరుగుతుంది
దేశాలను దోచుకునే
దుర్నీతి పెరుగుతుంది.
రాజకీయ అవినీతిని
రక్షణగా మలిచేస్తది
ప్రభుత్వాల్ని కార్పోరేట్ల
పిడికిట్లో బంధిస్తది



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం8-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:148 పేజీలు:6 వెల: రూ.1/-


## ఓఆర్ఆర్ లాగే ఆర్ఆర్ఆర్‌ను పూర్తి చేస్తాం

### -ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 7: ఓఆర్ఆర్ లాగే ఆర్ఆర్ఆర్ ను పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. వికారాబాద్‌లోని పరిగిలో నిర్వహించిన 'ప్రజా పాలన-ప్రగతి బాట' సభలో సీఎం మాట్లాడారు. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నించలేదన్నారు. ఓట్లు కావాలి కానీ, ప్రజల సమస్యలను ఏనాడైనా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకున్నాయని విమర్శించారు. వికారాబాద్ ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా చేస్తామన్నారు. రంగారెడ్డికి గోదావరి నీళ్లు ఇవ్వాలన్న ఆలోచన కేసీఆర్ చేయలేదన్నారు.

గోదావరి జలాలు 300టీఎంసీలు ఇస్తే 30లక్షల ఎకరాలు పారేవన్నారు. తాగునీటికి అల్లాడుతున్నామంటే అది మీ పాపం కాదా. అని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలు రాకుండా కేసీఆర్ అడ్డుకున్నారని సీఎం రేవంత్ అన్నారు.

## హుస్నాబాద్ అభివృద్ధే లక్ష్యం: మంత్రి పొన్నం

సిద్దిపేట, ఫిబ్రవరి 7: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. శనివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్.. 3, 4, 15, 16 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారాయన. ప్రచారంలో మంత్రి మాట్లాడుతూ.. తనను ఒకసారి ఎంపీగా ఎన్నుకుని పంపితే.. తెలంగాణ కోసం గొడవపడి ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన వ్యక్తిగా ముఖ్యమంత్రి ప్రశంసిస్తున్నారని చెప్పారు. ఈ ఊరు ముఖం తెలియని వ్యక్తి కూడా ఇక్కడకు వచ్చి మాట్లాడుతున్నారని మండపడ్డారు. 'నేను శాసనసభ్యుడిని.. నన్ను రారా, పోరా అంటున్నారు.. బిడ్డా! పొలిమేర కూడా దాటనివ్వను' అని పొన్నం హెచ్చరించారు.





హుస్నాబాద్ అభివృద్ధిపై చర్చకు రావాలని ప్రత్యర్థులకు సవాల్ విసిరారు మంత్రి పొన్నం. సిద్దిపేట, వరంగల్‌ను మించి హుస్నాబాద్‌ను అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో ముందుకు వెళున్నామన్నారు. పదేళ్ల క్రితం తమ హయాంలోనే శాతవాహన యూనివర్సిటీ వచ్చిందని.. మళ్లీ పదేళ్ల తర్వాత ఇప్పుడు ఇంజినీరింగ్, లా కాలేజీలు వచ్చాయని పేర్కొన్నారు. హుస్నా బాద్‌కు కరీంనగర్‌తో తల్లి పేగు సంబంధం ఉందని, దానిని బలవంతంగా సిద్దిపేటలో కలిపారని విమర్శించారు. ఆనాడు సీఎం.. పీసీసీ హోదాలో హుస్నాబాద్‌ను మళ్లీ కరీంనగర్‌లో కలుపుతామని చెప్పారని, ఆ బాధ్యత తనదేనని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారని, కుర్చీలు వేసుకుని ఆ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. ఏడాది క్రితం హుస్నాబాద్‌కు వచ్చినవారు ఇప్పుడు చూస్తే 'ఇది మా హుస్నాబాదేనా' అనేలా మార్పు తెచ్చామని మంత్రి చెప్పారు. హుస్నాబాద్ అభివృద్ధి కావాలనుకునే వారు.. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి అభ్యర్థులను గెలిపించాలని మంత్రి ప్రభాకర్ కోరారు.

## హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం





హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి స్పందించారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైల్ ఎవిడెన్స్ ల్యాబరేటరీ మొత్తం ఇక్కడి నుంచే ఆపరేషన్ జరుగుతుందని తెలిపారు. ఈ ల్యాబ్‌లోని ఏ ఫైల్స్ తగలబడ్డాయో ఇంకా స్పష్టత రాలేదని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగిందని డీసీపీ శిల్పవల్లి తెలిపారు. మొదటి అంతస్తులో పొగ రావడం గమనించిన ఆఫీస్ బాయ్.. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడని పేర్కొన్నారు. అప్పటికి ఇంకా ఆఫీసు పూర్తిగా ఓపెన్ కాకపోవడంతో కేవలం నలుగురు సిబ్బంది మాత్రమే ఉన్నారని.. వారంతా బయటకు వచ్చేశారని చెప్పారు. ఫైర్ యాక్సిడెంట్‌పై సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఐదు ఫైరింజన్లతో మంటలను ఆర్పివేశారని తెలిపారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఇంకా లోపలికి వెళ్లడానికి కుదరడం లేదని.. ల్యాబ్‌లో ఏ ఫైల్స్ తగలబడ్డాయో ఇంకా స్పష్టత రాలేదని చెప్పారు.ఓటుకు నోటు కేసుకు సంబంధించిన కీలక ఆధారాలున్న తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ అగ్నిప్రమాదంలో పలు కీలక ఫైల్స్ దగ్ధమైనట్లు సమాచారం.నేర పరిశోధనకు సంబంధించిన ఫైలు ఎవిడెన్స్ ల్యాబరేటరీ మొత్తం ఇక్కడి నుండే ఆపరేషన్ జరుగుతుంది.ఏ ఫైల్స్ తగలబడ్డాయో ఇంకా స్పష్టత లేదు

## రెండు రోజుల పర్యటన కోసం మలేసియా చేరుకున్న మోదీ.. స్వాగతం పలికిన మలేసియా ప్రధాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్రధాని నరేంద్ర మోదీ మలేసియాలో పర్యటిస్తున్నారు. రెండు రోజులపాటు ఆయన మలేసియాలో ఉంటారు. ఈ మేరకు ప్రత్యేక విమానంలో శనివారం సాయంత్రం మోదీ మలేసియా చేరుకున్నారు. ఆయనకు ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఘన స్వాగతం పలికారు. రాజధాని కౌలాలంపూర్‌లో చిన్నారులు రెండు దేశాల జాతీయ పతాకాలు చేతపట్టుకోగా.. మలేసియా ప్రధానితోపాటు ఇరు దేశాల ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.



అనంతరం ఒకే కారులో మోదీ, అన్వర్ హోటల్‌కు చేరుకున్నారు. ప్రధాని హోదాలో మోదీ అక్కడ పర్యటించడం ఇది మూడోసారి. ఈ పర్యటన ద్వారా రెండు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు బలోపేతం కావడంతోపాటు, కీలక అంశాల్లో సహకారం దిశగా ఒప్పందాలు జరగనున్నాయి. రక్షణ, భద్రత, ఆర్థిక పరమైన అంశాలపై మోదీ, అన్వర్ చర్చిస్తారు. మలేసియా ప్రధాని ఆహ్వానం మేరకు ఈ పర్యటన చేపడుతున్నట్లు మోదీ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు వేగంగా బలోపేతం అవుతున్నాయని, ఈ పర్యటన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత వృద్ధి చేస్తుందని భావిస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు. అలాగే మోదీ.. మలేసియాలోని భారతీయులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. అక్కడ దాదాపు మూడు మిలియన్లకుపైగా భారత జాతీయులు నివసిస్తున్నారు.

అక్కడ ఉంటున్న భారతీయులు రెండు దేశాల మధ్య స్నేహానికి, చారిత్రక నేపథ్యానికి వారధిగా మారారని అభివర్ణించారు. ఇండియా నుంచి మలేసియాకు చమురు, అల్యూమినియం, మాంసం, ఇనుము, స్టీల్, కాపర్, కొన్ని రకాల ఆర్గానిక్ కెమికల్స్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ వంటివి ఎగుమతి అవుతున్నాయి. ఇక మలేసియా నుంచి పామాయిల్, కొన్ని రకాల ఆయిల్స్, పరిశ్రమల మెషినరీ వంటివి ఇండియా దిగుమతి చేసుకుంటోంది. మోదీ పర్యటనలో భాగంగా ఇరు దేశాలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేస్తాయి.

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు ఎదురుదెబ్బ... 51 మంది లొంగుబాటు





బస్తర్, ఫిబ్రవరి 7: మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ జిల్లా బస్తర్ డివిజన్‌లో 51మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిపై రూ.1.61 కోట్ల రివార్డు ఉంది. వీరంతా బస్తర్ ఎస్పీ జితేందర్ యాదవ్ సమక్షంలో శనివారం నాడు లొంగిపోయారు. బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయమైన జగదల్‌పూర్‌లో బస్తర్ పాండుమ్ 2026 ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి అమిత్‌షా రాయపూర్ వచ్చిన రోజునే ఇంత పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

కాగా, బీజాపూర్ జిల్లాలో 20 మంది మహిళా క్యాడర్‌తో సహా 30 మంది మావోయిస్టులు లొంగిపోయారని, మరో 21 మంది సుక్మా జిల్లాలో లొంగిపోయారని ఎస్పీ సుందరరాజ్ తెలిపారు. వీరిలో 14 మంది మహిళా క్యాడర్ ఉన్నారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి కార్డెక్స్ వైర్లు, జెలటిన్ స్టిక్‌లో స్వాధీనం చేసుకున్నామన్నారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు రూ.50వేల తక్షణ సాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పునరావాస చర్యలతో స్వచ్ఛందంగా వీరంతా లొంగిపోయినట్టు చెప్పారు. కాగా, తక్కిన మావోయిస్టు క్యాడర్ కూడా హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలవాలని, వారికి భద్రత, గౌరవంగా జీవించేందుకు అవసరమైన పునరావసం కల్పిస్తామని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ కోరారు.

## పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వాతావరణ మార్పులపై అవగాహన

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్); :: రాష్ట్రంలో



పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించడంలో EPTRI కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్నారు. పర్యావరణ మార్పులపై పరిశోధన, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన తరగతులు, యూనివర్సిటీలలో విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు, పబ్లికేషన్స్ ప్రచురణలు మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం నేడు డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించడంలో EPTRI కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. పరిశోధన, శిక్షణ, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. EPTRI ద్వారా అమలవుతున్న ప్రస్తుత కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు, శిక్షణా కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులు, మానవ వనరుల అభివృద్ధి, ఆర్థిక అంశాలపై బోర్డ్ సభ్యులతో విస్తృతంగా చర్చించారు.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అనుగుణంగా పర్యావరణ అనుకూల కార్యక్రమాలను వేగవంతం చేయాలని, వివిధ శాఖలతో సమన్వయం పెంచాలని ఆయన సూచించారు.పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, నీటి, వాయు కాలుష్య నియంత్రణ, పచ్చదనం పెంపకం వంటి అంశాల్లో EPTRI మరింత చురుకైన పాత్ర పోషించాలని సమావేశంలో చర్చించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం విని యోగంతో పర్యావరణ పరిరక్షణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్య దర్శి టి.కె. శ్రీదేవి, పాల్గొన్నారు.

## ఎట్టకేలకు ఈఎన్సీని నియమించిన ప్రభుత్వం.. రమేశ్ బాబుకు అదనపు బాధ్యతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 7: ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్సీని నియమించింది. గత నెలలో పదవీ విరమణ పొందిన అంజద్ హుస్సేన్ స్థానంలో ఓలేటి వెంకట రమేశ్ బాబును నియమించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ నియమాకంపై ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వెంకట రమేశ్ బాబుకు ఈఎన్సీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన సూర్యాపేట, ఖమ్మం జిల్లాల చీఫ్ ఇంజినీర్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

## విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేలా సిలబస్‌లో మార్పులు



హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కాకతీయ విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధనల నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా పాఠ్యప్రణాళికలో విస్తృతమైన, సమకాలీన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె ప్రతాప్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలోని సైన్స్ విభాగాధిపతులు, పాఠ్యప్రణాళిక కమిటీ అధ్యక్షుడు, సైన్స్ విభాగాల డీన్ జి.హను మంతు సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేలా, సమాజ అవసరాలకు అనుగుణంగా సిలబస్ లో మార్పులు తీసుకురావాలని సూచించారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచే ఈ మార్పులు అమలులోకి వచ్చే విధంగా ఒక నెల వ్యవధిలో పాఠ్య ప్రణాళికను పునఃసిద్ధం చేయాలని ఆయా విభాగాలను ఆదేశించారు. ప్రతి సబ్జెక్టుకు అనుగుణంగా భారతీయ జ్ఞాన వ్యవస్థ (ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్)కు సంబంధించిన అంశాలను పాఠ్య ప్రణాళికలో తప్పనిసరిగా చేర్చాలని సూచించారు. భారత దేశానికి చెందిన సంప్రదాయ విజ్ఞానం, శాస్త్రీయ ఆలోచనలు, పరిశోధనా విధానాలు విద్యార్థులకు అవగాహన కలిగేలా ఈ అంశాలు ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా విలువాధారిత అదనపు కోర్సులు (వాల్యూ అడిషన్ కోర్సులు) ప్రతి విభాగంలో తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. సిలబస్ ను రూపొందించే సమయంలో పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, పరిశ్రమలు, ఇతర సంబంధిత వర్గాల (స్టేక్ హోల్డర్లు) అభిప్రాయాలు, సూచనలు కూడా తీసుకోవాలని సూచించారు.

### అంతర్జాతీయ స్థాయిలో పోటీ సామర్థ్యాన్ని పెంచుతుందని..

ప్రస్తుత ప్రపంచ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)తోపాటు క్వాంటం సాంకేతికతల వంటి ఆధునిక, భవిష్యత్ ప్రాధాన్యత కలిగిన అంశాలను పాఠ్య ప్రణాళికలో పొందుపరచాలని ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఇది విద్యార్థుల్లో అంతర్జాతీయ స్థాయిలో పోటీ సామర్థ్యాన్ని పెంచుతుందని, ప్రతి కోర్సుకు సంబంధించి కోర్సు ఫలితాలు, కార్యక్రమ ఫలితాలు, కార్యక్రమానికి ప్రత్యేకమైన ఫలితాలను (కోర్సు అవుట్ కమ్‌లు, ప్రోగ్రాం అవుట్ కమ్ లు, ప్రోగ్రాం స్పెసిఫిక్ అవుట్ కమ్‌లు) స్పష్టంగా పాఠ్యప్రణాళికలో పొందుపరచాలని ఆయా విభాగాల అధ్యయన మండలి సభ్యులు(బోర్డు ఆఫ్ స్టడీస్) ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. అదేవి ధంగా కోర్సుల రూపకల్పనలో విద్యార్థుల నైపుణ్యా భివృద్ధి, పరిశోధన దృక్పథం, ఉద్యోగావకాశాలు, సమకాలీన సమాజ సమస్యలకు పరిష్కారాలు సూచించే అంశాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠ్యప్రణాళిక విద్యార్థులను ఉద్యోగోన్ముఖులుగా, పరిశోధనాభిలాషులుగా తీర్చిదిద్దేలా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

# డిజిటల్ వ్యసన కట్టడికి ఏకైక మార్గం "డిజిటల్ ఉపవాసమే"

భారతదేశవ్యాప్తంగా బాలలు, కౌమార దశ యువతలో క్రమంగా స్క్రీన్ టైమ్ పెరుగుతూ, "డిజిటల్ వ్యసనం ప(డిజిటల్ అడిక్షన్)" బారిన పడుతూ, తమ ఆరోగ్యాలను మొగ్గ స్థాయిలోనే కోల్పోతున్నారని 29 జనవరి రోజు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన "2025 – 26 ఆర్థిక సర్వే" హెచ్చరికలు చేయడం గమనార్హం. స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, గేమింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లతో మితిమీరిన వాడకంతో వారి చదువులపైననే కాకుండా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలపై కూడా తీవ్రమైన దుష్ప్రభావాలకు చూపుతున్నట్లు సర్వే పేర్కొంటున్నది. వయస్సు ఆధారిత డిజిటల్ పరిమితులను విధించవలసిన సమయం ఆసన్నమైనదని హెచ్చరికలు చేసింది. అపరిమిత డిజిటల్ వినియోగదారుల్లో అధికంగా బాలలు, కౌమార దశ పిల్లలు ఉండడంతో రేపటి భారత భవ్య భవిష్యత్తు సంక్షోభంలో పడవచ్చని ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. హానికరమైన కంటెంట్ ఉన్న యాప్‌ల్లో మునిగి తమ చిరు జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారని పేర్కొనడం చూస్తున్నాం.

### డిజిటల్ స్క్రీన్‌టైమ్ మితిమీరితే అతి ప్రమాదం:

డిజిటల్ వ్యసనం మితిమీరితే పిల్లలు మానసిక క్షోభ, క్రియాత్మక బలహీనతలకు దారి తీస్తుందని సర్వే నిర్వచిస్తున్నది. డిజిటల్ అడిక్షన్ హద్దులు దాటితే ఏకాగ్రత క్షీణించడం, నిద్రలేమా సమస్యలు ఉత్పన్నం కావడం, ఆందోళన/నిరాశ/ఒత్తిడి ప్రమాదకర స్థాయికి పెరగడం, విద్యార్జన కోరిక తగ్గడం, సామాజిక సంబంధాలు తగ్గడం, ఒంటరితనం వేధించడం, చురుకుదనం మాయం కావడం, నైపుణ్యాలు తగ్గడం, పనితీరు క్షీణించడం, ఉత్పాదకత తగ్గడం లాంటి పలు అనర్థాలు జరుగుతున్నట్లు గమనించారు. పెద్దల్లో సహితం డిజిటల్ స్క్రీన్ టైమ్ పెరగడంతో సైబర్ మోసాలు/ బెదిరింపులు పెరగడం, ఆన్‌లైన్ ఖర్చులు పెరగడం, ఉపాధి అవకాశాలు తగ్గడం, ఉత్పాదకత పడిపోవడం గమనిస్తున్నాం. పిల్లలు, యువతలో మితిమీరిన స్క్రీన్‌టైమ్ ఫలితంగా మానసిక ఆరోగ్యంపై హానికరమైన ప్రభావాన్ని చూపుతున్నది. డిజిటల్ అడిక్షన్ వలలో చిక్కి 3 – 5 గంటలకు పైగా నీలి తెరల ముందు కూర్చున్నా పిల్లల్లో శారీరక శ్రమ తగ్గడం వల్ల ప్రమాదకర జీవనశైలి వ్యాధులు పెరగడం గమనిస్తున్నామని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### "డిజిటల్ వ్యసన" కట్టడికి "డిజిటల్ ఉపవాసమే" ఏకైక మార్గం:

15 నుంచి 24 ఏండ్ల వయస్సు యువభారతం సోషల్ మీడియా వ్యసన వలలో చిక్కడం వల్ల ఆందోళన, నిరాశ, ఆత్మగౌరవ సమస్యలు, సైబర్ బెదిరింపుల ఒత్తిడి, ఆత్మహత్యల రేటు పెరగడం చూస్తున్నాం. డిజిటల్ అడిక్షన్ దుష్ప్రభావాలను తగ్గించేందుకు "డిజిటల్ ఫాస్టింగ్" వ్రతం చేయాలని నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి ప్రతి రోజు కొన్ని గంటల పాటు లేదా వారానికి 1 లేదా 2 రోజుల పాటు స్మార్ట్ తెరలకు దూరంగా ఉండడాన్ని డిజిటల్ ఫాస్టింగ్ (ఉపవాసం) అని పిలుస్తున్నాం. 2024లో భారత్‌లో ఇంటర్నెట్ వినియోగదారులు 43 శాతం సామాజిక మాధ్యమాలను వాడినట్లు సర్వేలు నిర్థారిస్తున్నాయి. పాఠశాలల్లో శారీరక వ్యాయామం తప్పనిసరి చేయడంతో పాటు స్క్రీన్‌టైమ్ నిర్వహణపై తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని సూచిస్తున్నారు. దీనితో పాటుగా వయస్సును బట్టి డిజిటల్ యాక్సస్ విధానాలు, హానికర కంటెంట్ హోస్టుల విపరీతాలను అదుపు చేయడం, స్క్రీన్ టైమ్‌ను విధిగా తగ్గించడం జరగాలి. ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు సోషల్ మీడియా ఖాతాలపై నిషేధం విధించడం ఇతర దేశాలను మార్గదర్శకం చేయాలి. దక్షిణ కొరియా సహితం "షట్‌డౌన్ చట్టం" ద్వారా మైనర్లు గేమింగ్ వెబ్‌సైట్లను వాడకుండా పరిమితులు విధించడం హర్షదాయకం. ఇదే క్రమంలో సింగపూర్, ఫ్రాన్స్, స్పెయిన్, ఫిన్లాండ్, జపాన్, బ్రెజిల్, కొన్ని యూఎస్ రాష్ట్రాలు కూడా డిజిటల్ అడిక్షన్ విషయంలో తగు చర్యలను తీసుకోవడం జరిగింది.

డిజిటల్ అడిక్షన్ మరింత విష ప్రభావాన్ని చూపకముందే భారత ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకొని తగు చట్టాలను చేయడం, తల్లితండ్రులు మేల్కొనడం, విద్యాలయాలు శారీరక శ్రమకు పెద్ద పీట వేయడం, పౌర సమాజం కీలక పాత్రలను నిర్వహించడం సత్వరమే జరగాలి. డిజిటల్ తెరలు యువభారత భవిష్యత్తును, మానసిక ఆరోగ్యాలను, సామాజిక అభివృద్ధిని దెబ్బతీయకుండా అవసరమైన చర్యలను తీసుకోవాలని ఆశిద్దాం. రేపటి తరం ఉజ్వల భవితకు డిజిటల్ వెలుగులు ఉపయోగపడే విధంగా మార్గదర్శనం చేద్దాం.



–ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

అమరావతి, ఫిబ్రవరి 7: వైఎస్ఆర్ కడప జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు 1.061 టన్నుల బరువు కలిగిన 36 ఎర్రచందనం దుంగలను, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇవాళ రాజంపేటలోని మన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ ఈ వివరాలను వెల్లడించారు.

1.061 టన్నుల 36 ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుని, ఐదుగురు దుండగులను అరెస్ట్ చేశామన్నారు.

పట్టుకున్న సరుకును స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. అక్రమ రవాణాపై సమాచారం ఉన్నవారు పోలీసులకు తెలపాలని, వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

# ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు ఉపరాష్ట్రపతి అభినందనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: జింబాబ్వేలోని హరారేలో జరిగిన ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ ట్రోఫీని గెలుచుకున్న భారత యువ ఛాంపియన్లకు ఉపరాష్ట్రపతి శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

భారతదేశం రికార్డు స్థాయిలో ఆరోసారి ఈ ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను కైవసం చేసుకోవడం నిజంగా ఒక చారిత్రాత్మక సందర్భమని ఆయన సామాజిక మాధ్యమం పోస్ట్‌లో అభివర్ణించారు.

రికార్డు స్థాయి ప్రదర్శన కనబరిచిన యువ స్టార్ వైభవ్ సూర్యవంశీని ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. కెప్టెన్ ఆయుష్ మ్హాత్రేతో పాటు భారత జట్టు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేశం గర్వించదగ్గ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారందరినీ ఆయన అభినందించారు.

# ప్రామాణిక వైకల్యంగల అభ్యర్థులకు 'పరీక్ష కేంద్రం ఎంపిక'తో సౌలభ్యం మెరుగుపరచిన యూపీఎస్‌సీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశవ్యాప్తంగా 'సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2026 (సీఎస్ఈ), ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్-2026 (ఐఎఫ్ఓఎస్) నిర్వహణ దిశగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) అనేక సాంకేతికపరమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అభ్యర్థుల సౌలభ్యం పెంపు, పరీక్షల భద్రత బలోపేతంపై తొలుత దృష్టి సారించింది. ఈ ఏడాది (20 26) 'సివిల్ సర్వీసెస్' కోసం 933 ఖాళీలు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ కు 80 ఖాళీల భర్తీకి యూపీఎస్‌సీ నోటిఫికేషన్లు జారీ చేస్తుంది.

సామర్థ్యం, పారదర్శకత, అభ్యర్థుల సౌలభ్యం మెరుగు కోసం చేపట్టే చర్యల్లో భాగంగా దరఖాస్తుల సమర్పణ, పరీక్షల నిర్వహణ కోసం పునర్నవీకృత ఆన్‌లైన్ అప్లికేషన్ పోర్టల్‌ను యూపీఎస్‌సీ అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తుల దాఖలు సులభతరం కావడమే గాక పరీక్ష ప్రక్రియలోని వివిధ దశలలో సమగ్రత బలోపేతం అవుతుంది.

ఈ కీలక సంస్కరణ కింద ప్రామాణిక వైకల్యంగల (పీడబ్ల్యూబీడీ) అభ్యర్థులకు మద్దతు లక్ష్యంగా పరీక్ష కేంద్రం కేటాయింపు చట్రాన్ని మార్పుచేసింది. ఈ మేరకు సవరించిన విధానం ప్రకారం 'పీడబ్ల్యూబీడీ' అభ్యర్థులకు పరీక్ష కేంద్రం సామర్థ్యంతో నిమిత్తం ఉండదు. ప్రస్తుతం ప్రతి కేంద్రం సామర్థ్యం మేరకు సాధారణ, 'పీడబ్ల్యూబీడీ' అభ్యర్థులు ఉపయోగించుకుంటారు. దీంతో ఒక కేంద్రం పూర్తిగా నిండిన తర్వాత సాధారణ అభ్యర్థులు దాన్ని ఎంపిక చేసుకునే వీలుండదు. కానీ, 'పీడబ్ల్యూబీడీ' అభ్యర్థులకు మాత్రం అదే కేంద్రాన్ని ఎంచుకోగల అవకాశం కొనసాగుతుంది. తదనుగుణంగా వారి ప్రాధాన్యం మేరకు వారికి పరీక్ష కేంద్రం కేటాయించాల్సిన సందర్భంలో పరీక్ష కేంద్రం సామర్థ్యాన్ని కమిషన్ పెంచుతుంది.

దీనిపై యూపీఎస్‌సీ చైర్మన్ డాక్టర్ శ్రీ అజయ్ కుమార్ మాట్లాడుతూ– "గడచిన ఐదేళ్లుగా పరీక్ష కేంద్రాల గణాంకాల విశ్లేషణ సందర్భంగా ఢిల్లీ, కటక్, పాట్నా, లక్నో సహా కొన్ని కేంద్రాల సామర్థ్యం ప్రారంభ దశలోనే నిండిపోయింది. అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడమే ఈ పరిమాణానికి కారణమని తేలింది. దీనివల్ల 'పీడబ్ల్యూబీడీ' అభ్యర్థులకు ఇబ్బందులు తప్పలేదు. అయితే, ఇప్పుడు సవరించిన విధానం ఫలితంగా ప్రతి 'పీడబ్ల్యూబీడీ' అభ్యర్థి తమ సౌలభ్యం మేరకు వారు పరీక్ష కేంద్రం ఎంచుకోగల భరోసా లభిస్తుంది. యూపీఎస్‌సీ పరీక్షకు హాజరు కావడంలో వారికి మరింత సౌలభ్యంతోపాటు సౌకర్యం కూడా లభిస్తుంది" అని వివరించారు.

అధిక డిమాండ్గల ప్రాంతాలపై ఒత్తిడి తగ్గించేందుకు వీలుగా పరీక్ష కేంద్రాల నెట్‌వర్కును కూడా కమిషన్ విస్తరించింది. లక్నో పరిసరాల్లో ఒత్తిడి తగ్గించేలా ఢిల్లీ–ఎన్‌సీఆర్, కాన్పూర్ కేంద్రాలకు మీరట్‌ను జోడించారు. అలాగే, కటక్ సమీపంలోని కేంద్రాలకు అదనంగా భువనేశ్వర్‌ను చేర్చారు. ప్రిలిమినరీ పరీక్ష కోసం ఈ కేంద్రాలను జోడించడంతో మొత్తం ప్రిలిమ్స్ కేంద్రాల సంఖ్య 80 నుంచి 83కు పెరిగింది. ఇక మెయిన్స్ పరీక్ష కోసం భువనేశ్వర్, శ్రీనగర్, ఇంఫాల్‌లను చేర్చడంతో కేంద్రాల సంఖ్య 24 నుంచి 27కు పెరిగింది.

ఈ కీలక ప్రణాళిక ప్రక్రియను మరింత బలోపేతం చేస్తూ పునర్నవీకృత దరఖాస్తుల అప్లికేషన్ పోర్టల్ ఇప్పుడు పరీక్ష కేంద్ర ప్రాధాన్యాల సంబంధిత కొత్త అంశంతో రూపొందింది. ప్రకటిత పరీక్ష కేంద్రాల నుంచి ఎంపికతోపాటు డ్రాప్‌డౌన్ జాబితా ద్వారా తమకు సౌలభ్యంగల సమీపంలోని నగరాలను సూచించమని అభ్యర్థులు కోరవచ్చు. ఈ సమాచారం అభ్యర్థుల ప్రాధాన్యంపై అధ్యయనంగా ఉపయోగపడుతుంది. అలాగే సాధ్యమైన సందర్భాల్లో కొత్త పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు తగిన ప్రదేశాలను గుర్తించే వీలుంటుంది.

పరీక్ష ప్రక్రియ సమగ్రతను పెంచే దిశగా పోర్టల్‌లో ఫోటో వెరిఫికేషన్, ఫేస్ రికగ్నిషన్ సాంకేతికత–ఆధారిత వెసులుబాటు కూడా ఉంటుంది. తద్వారా పరీక్ష సంబంధిత వివిధ దశలలో గుర్తింపు ధ్రువీకరణను బలోపేతం చేయడమేగాక మరింత బలమైన, పారదర్శక వ్యవస్థకు దోహదం చేస్తుంది.

ఈ మేరకు కమిషన్ విధానాన్ని డాక్టర్ శ్రీ అజయ్ కుమార్ స్పష్టం చేస్తూ– "ఉచిత, న్యాయమైన, సమగ్ర, సౌలభ్య పరీక్ష ప్రక్రియకు భరోసా ఇస్తూ కమిషన్ తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోంది. అభ్యర్థుల సౌలభ్యం, భాగస్వామ్యం పెంపుపై కమిషన్ నిశితంగా దృష్టి సారించింది. అదే సమయంలో ఎంపిక కచ్చితంగా ప్రతిభ ప్రాతిపదికనే చేపడతాం" అని ప్రకటించారు.

యూపీఎస్‌సీ శతాబ్ది సంవత్సర వేడుకల నేపథ్యంలో చేపట్టిన ఈ చర్యలు న్యాయమైన, పారదర్శక, సమగ్ర అత్యున్నత ప్రమాణాలకు హామీ ఇస్తున్నాయి. అలాగే, నమకాలీన అవసరాలకు తగినట్లు ఆయా ప్రక్రియల రూపకల్పనకు కమిషన్ నిరంతర కృషిని ప్రతిబింబిస్తున్నాయి.

# ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను పాల్గొని విజయవంతం చేద్దాం..



అమరావతి, ఫిబ్రవరి 7: కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శివ నాగేంద్రం అన్నారు. కోడూరులోని మార్క్సిస్టు విజ్ఞాన భవనం నందు ఫిబ్రవరి 12న జరగబోయే దేశవ్యాప్త సమ్మె కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శివ నాగేంద్రం మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ ఉద్యమం విరమణ సందర్భంగా దేశ ప్రధాని మోడీ రైతాంగానికి క్షమాపణ చెప్పి మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తున్నామని విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకుంటున్నామని, రైతుకు గిట్టుబాటు ధర అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఎటువంటి హామీని నెరవేర్చకుండా రైతాంగానికి ద్రోహం చేస్తున్నారన్నారు.

కార్పొరేట్ల ప్రయోజనం కోసం మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ తెచ్చి పని గంటలు 8 నుండి 12 కు పెంచి అదనపు జీతం కూడా చెల్లించకుండా కనీస వేతనాలు కోసం కార్మికులు బేరసారాలు ఆడే హక్కు హరించిందన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణ రావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కరిముల్లా, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు సింగోతు నాగేంద్రం, సిఐటియు మండల కార్యదర్శి విక్టోరియా, రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పోలాబత్తిన మోహన్రావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బొర్రా వెంకటేశ్వరావు, జరుగు గిరి, చెక్క వెంకటేశ్వరరావు, అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, వివోలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసార భారతి డిజిటల్-ఫస్ట్ కంటెంట్ వ్యూహం: వేవ్స్ ఓటీటీ, పే-పర్-వ్యూ విధానంతో డిజిటల్ దిశగా మార్పు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్రసార భారతి 'కంటెంట్ సేకరణ విధానం– 2024' కింద ఆకాశవాణి, డీడీ ఛానెళ్లు, వేవ్స్ ఓటీటీ వేదికల కోసం కంటెంట్ సేకరణ జరుగుతోంది. 2025లో ప్రారంభించిన 'వీక్షణల ఆధారిత చెల్లింపు (పే–పర్–వ్యూ)' విధానంలో వేవ్స్ సహా డిజిటల్, ఓటీటీ వేదికల కోసం కంటెంటును సేకరిస్తున్నారు. సంప్రదాయ టీవీ, రేడియో ప్రసారాల నుంచి డిజిటల్ కంటెంట్ ప్రసారం దిశగా.. వ్యూహాత్మక మార్పును ఇది ప్రతిబింబిస్తోంది. డిజిటల్ ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణమైన కంటెంటును సేకరించేందుకు ఈ విధానం ప్రసార భారతికి తోడ్పడింది. దీనివల్ల సంస్థ తన పరిధిని గణనీయంగా విస్తరించుకోవడమే కాకుండా, ముఖ్యంగా యువతకు మరింత చేరువైంది.

దేశంలో విక్రయించే అన్ని టెలివిజన్ సెట్‌లలో ఇన్‌బిల్ట్ శాటిలైట్ ట్యూనర్ తప్పనిసరిగా ఉండాలని ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి అనుగుణంగా.. ఇకపై డీడీ ఫ్రీ డిష్ సెట్ టాప్ బాక్సుల పంపిణీ ప్రతిపాదనను కొనసాగించడం లేదు.

ప్రస్తుతం ఈశాన్య ప్రాంతంలోని దూరదర్శన్‌లో 1994 ఖాళీలు, ఆలిండియా రేడియో కేంద్రాల్లో (ఆకాశవాణి) 1636 ఖాళీలు ఉన్నాయి.

తన భూముల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం కోసం ప్రసార భారతి ఒక నిపుణుల సంస్థను నియమించుకుంది.

రాజ్యసభలో శ్రీ సుఖేందు శేఖర్ రే అడిగిన ప్రశ్నకు ఇచ్చిన ప్రశ్నకు.. సమాచార – ప్రసార శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈ మేరకు సమాధానమిచ్చారు.

# తెలంగాణ ఉద్యమకారులకి ఇచ్చిన హామీలను త్వరలో అమలు


**–సిఎం రేవంత్ రెడ్డి , పొన్నం ప్రభాకర్ టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ లకు తెలంగాణ ఉద్యమ కారుల పాలాభిషేకం**




హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ఉద్యమ కారుల కి ఇచ్చిన హామీలను త్వరలో అమలు చేయనున్న తెలంగాణ ప్రభుత్వం కు తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ ధన్యవాదములు తెలిపింది. ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ , టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ నాయకులు నాయకురాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా ఫోరమ్ చైర్మన్ డా చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ కెసిఆర్ తెలంగాణ ఉద్యమ కారుల ను పూర్తిగా విస్మరించితే గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో తెలంగాణ ఉద్యమ కారుల కి 250 గజాల ఇంటి స్థలం పెన్షన్ సౌకర్యం హామీల ను పెట్టటం జరిగింది. ఇచ్చిన హామీలను అమలు పై టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ గత శాసన మండలి లో ప్రస్తావించటం జరిగింది. మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గారు హామీలను అమలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని ప్రకటన చేయటం జరిగింది. ఈనెల లో హామీల అమలు ను ప్రారంభించాలని ముఖ్యమంత్రి గారు భావిస్తున్నట్లు సమాచారం తో వారికి తెలంగాణ ఉద్యమ కారుల తరపున ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఎవరో ఒక్కరి వల్ల రాలేదు 1200 మంది పైగా ఆత్మ బలిదానాలు తో వేలాది మంది ఉద్యమ కారుల ఉద్యమాలు పోరాటాల వల్ల వచ్చింది. త్యాగాలు ఉద్యమ కారులు చేస్తే భోగాలు రాజకీయ నాయకులు అనుభవించారు. తెలంగాణ సెంటిమెంట్ ను వాడుకొని వేల కోట్లు సంపాదించుకొని ఉద్యమ కారుల ను విస్మరించిన వాళ్ళని మరొక సారి నమ్మొద్దని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ ఉద్యమ కారుల కి ప్రాధాన్యత ను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వాళ్లు దయానంద్. జగన్ యాదవ్. కొండా స్వామి. నాగ జ్యోతి. రజనీకాంత్. సంధ్యారెడ్డి. జయ. సమ్మెట గౌడ్. బింగి రాజు భూపాల్. బాల నరసింహ. శివ కుమార్ నేత. జోగు అంజయ్య. చంద్ర శేఖర్. భానుప్రకాష్ రెడ్డి. తదితేరులు పాల్గొన్నారు.

# పెద్దపులిని పట్టేశారు

**–విశాఖ యానిమల్ రెస్క్యూ సెంటర్‌కి తరలింపు**



అమరావతి, ఫిబ్రవరి 7: గత కొన్ని రోజులుగా తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం కూర్మాపురం పరిసర ప్రాంతాలలో హల్చల్ చేసిన పెద్దపులిని రాష్ట్ర అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు శుక్రవారం మత్తుమందు ఇచ్చి బంధించారు. అనంతరం ప్రత్యేక బోనులో విశాఖ జూపార్క్ సమీపంలోని యానిమల్ రిస్క్యూ సెంటర్ కు శనివారం ఉదయం తరలించారు.

ఫారెస్ట్ చీఫ్ సెక్రటరీ దివాన్ మైదిన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు తూర్పుగోదావరి జిల్లాలో రాయవరం సమీప ప్రాంతంలో స్థానిక ప్రజలకు కంటిమీద కొనుకు లేకుండా చేసిన పెద్దపులిని ప్రత్యేక బృందం పట్టుకున్నారన్నారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకుగాను విశాఖ జూ పార్కు సమీపంలోని ఏఆర్సి కి తరలించినట్టు తెలిపారు.

ఈ పెద్దపులి వయసు సుమారు మూడు నుండి మూడున్నర సంవత్సరాలు ఉంటుందని, ప్రస్తుతం పెద్దపులి ఆరోగ్య నిలకడగా ఉందన్నారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి 24 గంటలు అబ్జర్వేషన్ లో ఉంచాల్సి ఉంటుందన్నారు. అనంతరం అధికారుల ప్రత్యేక కమిటీ ఆదేశాల మేరకు పెద్దపులిని ఎక్కడ ఉంచాలనేది నిర్ధారిస్తామని తెలియజేశారు. ఈ పెద్ద పులి బోనులో అటు ఇటు కలియ తిరుగుతూ, భీకరమైన గాండ్రింపులతో హల్చల్ చేస్తోంది.

# మెదడుకు సానపెట్టండి.. చదవండి, విజయం సాధించేందుకు ఇది సాయపడుతుంది: పీఎం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: గుజరాత్‌కు చెందిన విద్యార్థి ప్రధానమంత్రిని ఓ ప్రశ్న అడిగాడు. తమ గురించి తల్లిదండ్రులు ఆందోళన పడుతుంటే.. ఉపాధ్యాయులు తోడ్పాటునిస్తారని ఆ విద్యార్థి అన్నాడు. అయితే చదువుకొనే విషయంలో తమ ఉపాధ్యాయులు ఒక పద్ధతిని.. తల్లిదండ్రులు మరో విధానాన్ని సూచిస్తుంటే, తాము మాత్రం మరోదాన్ని అనుసరిస్తున్నామని, వీటిలో ఏది సరైనదో తెలియక తికమకపడుతున్నామని చెప్పాడు. దీనికి ప్రధానమంత్రి స్పందిస్తూ.. ఇది జీవితాంతం కొనసాగుతూనే ఉంటుందని, ప్రధానమంత్రిగా తనకు కూడా ప్రజలు వివిధ రకాల సూచనలిస్తుంటారని చెప్పారు. ఒక ఇంట్లో ఉన్న తోబుట్టువులకు వేర్వేరు ఆహారపు అలవాట్లు ఉంటాయన్నారు. కొందరు కూరగాయలతో, ఇంకొందరు పప్పుతో, మరికొందరు అన్నీ కలగలిపి తింటారు. ప్రతి ఒక్కరికీ వారికంటూ ప్రత్యేకమైన శైలి ఉంటుందని వివరించారు. అయితే, ఎవరి శైలిని వారు అనుసరిస్తేనే ఆనందమన్నారు. కొందరు రాత్రి పూట చదవడానికి ప్రాధాన్యమిస్తే.. మరికొందరు ఉదయాన్నే చదువుకుంటారని, అది వారి ఇష్టానుగుణంగా ఉంటుందని శ్రీ మోదీ తెలిపారు. ఈ విషయంలో అబద్ధాలు చెప్పకూడదని హెచ్చరిస్తూ.. కొందరు తమ తల్లులకు ఉదయాన్నే చదువుకుంటామని చెప్పి, తెల్లారిన తర్వాత దాని గురించి పట్టించుకోరన్నారు. విద్యార్థులు తమ సొంత శైలిని విశ్వసించాలని, సూచనలను జాగ్రత్తగా వినాలన్నారు. ఇతరులు చెప్పారని కాకుండా, వ్యక్తిగత అనుభవం ద్వారా శైలిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. పరీక్షా పే చర్చ మొదలు పెట్టినప్పుడు ఒక పద్ధతి ఉండేదని, కాలక్రమేణా దానికి మార్పులు చేసినట్లు వివరించారు. మూల ఉద్దేశానికి కట్టుబడి ఉంటూనే.. ఇప్పుడు వేర్వేరు రాష్ట్రాల్లో సెషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి స్నేహపూర్వకతత్వాన్ని గుర్తించిన విద్యార్థులు ఆయనతో చాలా సులభంగా మాట కలిపారు. వివిధ పద్ధతుల గురించి తెలుసుకొని, వాటి నుంచి మంచిని స్వీకరించాలన్నారు. కానీ, తమ సొంత పద్ధతిపై దృష్టి సారించి క్రమంగా దాన్ని బలోపేతం చేసుకోవాలని చెప్పారు.

తరచూ పాఠశాల లేదా ఉపాధ్యాయుల వేగాన్ని తాము అందుకోలేకపోతున్నామని, వెనకబడిన పాఠాలను నేర్చుకోవాలని ప్రయత్నిస్తే.. తర్వాతి అధ్యాయాల్లో వెనకబడిపోతున్నామని ఓ విద్యార్థి చెప్పాడు. ఉపాధ్యాయులు బోధనలో విద్యార్థుల కంటే ఒక్కడుగు మాత్రమే ముందుండాలని, మరీ ఎక్కువ దూరంలో ఉండకూడదని శ్రీ మోదీ అన్నారు. లక్ష్యం చేరుకోగలిగేగా ఉండాలి కానీ.. సాధించేందుకు సులభంగా ఉండకూడదని వివరించారు. "లక్ష్యానికి చేరువగా ఉండాలి. కానీ అది సులభంగా దక్కేలా ఉండకూడదు'' అని ఎగ్జామ్ వారియర్ మంత్ర 26ను విద్యార్థి గుర్తు చేసుకోగా.. అతడి జ్ఞాపకశక్తిని ప్రధాని ప్రశంసించారు. విద్యార్థులకంటే ఉపాధ్యాయులు 50 అడుగుల ముందుంటే విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతారు. పొలాన్ని రైతు దున్నినట్టే.. విద్యార్థుల మెదడును ఉపాధ్యాయులు సిద్ధం చేయాలన్నారు. ప్రతి వారంలోనూ బోధించే అధ్యాయాల గురించి ఉపాధ్యాయులు ముందుగానే చెప్పాలని ఆయన సూచించారు. దానివల్ల పాఠ్యాంశం ప్రారంభానికి ముందే.. విద్యార్థులు చదవడం, రాయడం, ఆన్‌లైన్లో శోధించడం మొదలుపెడతారన్నారు. బోధన వాస్తవికంగా ఉన్నప్పుడు విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని, అర్థం చేసుకొనే శక్తి పెరుగుతుందని, ఏకాగ్రత మెరుగవుతుందని వివరించారు. ఒక అధ్యాయం ఆసక్తికరంగా ఉంటే.. విద్యార్థులు దాని గురించి మరింత తెలుసుకోవాలనుకుంటారని, పునఃశ్చరణ బలోపేతమవుతుందన్నాను. ఇది చాలా సులభమైన పద్ధతి అని.. ఇలా చేసిన తర్వాత కూడా ఉపాధ్యాయుల వేగం ఇంకా సమస్యగానే ఉంటుందా అని ప్రశ్నించారు. దానికి విద్యార్థి అవును అని సమాధానమివ్వగా శ్రీ మోదీ ఉండదు అని చెప్పాలని సరిచేశారు. ఎందుకంటే ఉపాధ్యాయుని కంటే ఓ అడుగు ముందే ఉన్నప్పుడు, విద్యార్థుల్లో వెనకబడి ఉన్నామనే భావన ఉండదన్నారు. "ముందు మెదడుకి పదును పెట్టండి, దానితో అనుసంధానమవ్వండి. ఆ తర్వాతే పాఠాలను చదవండి. అప్పుడే.. విద్యార్థులు విజయం సాధిస్తారు" అని తెలిపారు. ప్రధానమంత్రితో ముఖాముఖిగా మాట్లాడే, ప్రశ్నలు అడిగే, చర్చించే అవకాశం అందరికీ రాదని విద్యార్థులు అన్నారు. ఉపాధ్యాయుల కంటే రెండు అడుగులు ముందుండాలని సలహా ఇచ్చారని, ఇప్పుడు తాము చదువులో వెనకబడి పోమని వారు వెల్లడించారు.

'హమారా భారత్ భూమి' పేరుతో హిందీ, నేపాలీ, బెంగాలీ భాషల్లో దేశభక్తి గీతాన్ని తాను స్వరపరిచినట్లు సిక్కింకు చెందిన విద్యార్థిని తెలియజేసింది. ఆశ్చర్యపోయిన ప్రధానమంత్రి.. కవితలు రాయడం ఇష్టమా అని అడిగారు. వాటిని చదివి వినిపించమని ప్రోత్సహించారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' అన్న జాతీయ ఐక్యతా స్ఫూర్తి గురించి ఆమె పలికిన విధానాన్ని మెచ్చుకున్నారు. ఆ తర్వాత మాన్సీ అనే విద్యార్థినిని పాట పాడమని శ్రీ మోదీ అడిగారు. విద్యార్థులకు అంకితమిస్తూ.. తన తల్లి రాసిన పాటను మాన్సీ పాడి వినిపించింది. ఆమెను ప్రశంసిస్తూ.. తన తరఫున ఆమె తల్లికి అభినందనలు తెలియజేయమని ప్రధాని చెప్పారు. యూట్యూబ్ ఛానల్, ఫేస్‌బుక్ పేజీ, ఇన్స్టా పేజీని తాను నడుపుతున్నట్లు ఓ విద్యార్థి చెప్పాడు. తన ఫేస్‌బుక్ ఖాతాను 1.5 లక్షల మంది అనుసరిస్తున్నారని వెల్లడించాడు. ఆశ్చర్యపోయిన ప్రధాని అతడిని అభినందిస్తూ.. ఇలాంటి ప్రతిభావంతులైన వారిని కలుసుకోవడం తనకు గర్వకారణమన్నారు.

అస్సాం గమోఛాతో ప్రధాని విద్యార్థులకు స్వాగతం పలికారు. అది తనకు అత్యంత ఇష్టమైనదని చెప్పారు. అస్సాం, ఈశాన్య ప్రాంతంలో మహిళా సాధికారతకు గమోఛా చిహ్నమని, అక్కడి మహిళలు దీనిని రూపొందిస్తారని వివరించారు. ఇది వారి సామర్థ్యాన్ని, సహకారాన్ని సూచిస్తుందన్నారు. విద్యార్థులకు గౌరవపూర్వకంగా గమోఛాను అందించాలనేది తన కోరిక అని చెప్పారు.

విద్యార్థుల్లో ఉన్న అయోమయాన్ని, భయాన్ని తెలియజేస్తూ.. నైపుణ్యాలు ముఖ్యమా మార్కులు ప్రధానమా అని సబావత్ వెంకటేశ్ అనే విద్యార్థి ప్రధానిని అడిగాడు. తినడమైనా- నిద్రపోవడమైనా, చదవడమైనా- ఆడుకోవడమైనా, నైపుణ్యాలైనా-మార్కులైనా జీవితంలో సమతౌల్యం అవసరమని ప్రధానమంత్రి సమాధానమిచ్చారు. ఒకవైపే మొగ్గు చూపడం అసమతౌల్యానికి దారి తీస్తుందని, సరైన సమతౌల్యం స్థిరత్వాన్ని అందిస్తుందన్నారు. నైపుణ్యాలు రెండు రకాలు - జీవన నైపుణ్యాలు, వృత్తిగత నైపుణ్యాలు- ఈ రెండూ ముఖ్యమైనవేనని చెప్పారు. విజ్ఞానం, పరిశీలన, అధ్యయనం లేకుండా ఏ నైపుణ్యం మెరుగుపడదని, విజ్ఞానంతోనే నైపుణ్యం మొదలవుతుందని వివరించారు.

దీనిని ఉదాహరణలతో శ్రీ మోదీ వివరించారు: జీవన నైపుణ్యాలు లేకపోతే.. వంట చేయడం, రైల్వే స్టేషన్లో టిక్కెట్టు కొనుక్కోవడం లాంటి దైనందిన పనుల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, అనుసరణీయతతో సహా జీవన నైపుణ్యాలను పూర్తిగా అలవరుచుకోవాలని ఆయన స్పష్టం చేశారు. వృత్తిగత నైపుణ్యాల గురించి వివరిస్తూ.. తమ నైపుణ్యాలను వైద్యులు నిరంతరం మెరుగుపరుచుకోవాలని, పుస్తక జ్ఞానం మాత్రమే హృద్రోగ నిపుణుడ్ని తయారుచేయలేదని తెలిపారు. రోగులతో కలిసి పనిచేసినప్పుడే అసలు నైపుణ్యాలు అలవడతాయన్నారు. అదే విధంగా న్యాయస్థానంలో వాదించే నైపుణ్యాలు పెంపొందించుకోవాలంటే రాజ్యాంగ నిబంధనల గురించి తెలుసుకోవడం మాత్రమే కాకుండా.. సీనియర్లతో కలిసి న్యాయవాదులు ప్రాక్టీసు చేయాలి. కొత్త సాంకేతికతలను స్వీకరించాలంటే.. 40 ఏళ్ల వయసులో కూడా నిరంతర అభ్యాసం అవసరమని ఆయన స్పష్టం చేశారు. వైద్యం, ఇతర రంగాల్లో వస్తున్న పురోగతులను అందిపుచ్చుకోవడానికి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉంది. విద్య, నైపుణ్యాలు కవలల్లాంటివని, వాటిని విడివిడిగా చూడలేమని, అవి జీవితంలో తప్పనిసరి అని తెలిపారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పట్ల తనకున్న అభిమానాన్ని మణిపూర్లోని ఇంఫాల్లో ఉన్న సైనిక్ పాఠశాల విద్యార్థి వ్యక్తం చేశాడు. తనది, ప్రధానిది పుట్టిన రోజు ఒకటేనని చెప్పారు. గడచిపోయిన సంవత్సరాలను తాను లెక్కపెట్టనని, మిగిలి ఉన్న సమయంపైనే తాను దృష్టి పెడతానని చెప్పారు. గతం గురించి ఆలోచిస్తూ.. సమయాన్ని వృథా చేసుకోవద్దని, భవిష్యత్తు గురించి ఆలోచించమని విద్యార్థులను శ్రీ మోదీ కోరారు.

గతేడాది ప్రశ్నల ఆధారంగా పరీక్షలకు సన్నద్ధమయ్యే వ్యూహాల గురించి అడిగినప్పుడు.. చాలా సందర్భాల్లో ప్రశ్నాపత్రం కష్టంగా ఉందని విద్యార్థులు భావిస్తారని ప్రధాని అన్నారు. దీనికి కారణం ఆ ప్రశ్నలు సిలబస్‌లో లేకపోవడం కాదని.. కొన్ని పునరావృత నమూనాలకే పరిమితం కావడమని చెప్పారు. తాను విద్యార్థిగా ఉన్న సమయంలోనూ ఇదే పరిస్థితి ఉండేదని, కొన్ని సందర్భాల్లో మార్కులకే ప్రాధాన్యమిచ్చేలా ఉపాధ్యాయులు వ్యవహరించేవారన్నారు. మొత్తం సిలబస్‌ను పూర్తి చేసి, దానిని వాస్తవ జీవితానికి తగినట్టుగా అనువదించడం ద్వారా సమగ్ర విజ్ఞానం అందించేందుకు మంచి గురువులు ప్రాధాన్యమిస్తారన్నారు. క్రికెట్లో బౌలర్‌ను ఉదాహరణగా చూపిస్తూ.. భుజం కండరాలను బలోపేతం చేసుకోవడానికే పరిమితం కాకుండా.. యోగా చేసి మొత్తం శరీరాన్ని, మనసును బలోపేతం చేసుకోవాలని, ఆహార నియమాలు పాటించాలని, తగినంత నిద్రపోవాలని వివరించారు. అదే మాదిరిగా.. పరీక్షల కోసమే చదువు కాదని, జీవితం కోసమని తమని తాము సమీక్షించుకోవడమే పరీక్షల వెనక ఉన్న అర్థమని ఆయన చెప్పారు. అంతిమ లక్ష్యం మార్కులు కాదు.. జీవిత పరిపూర్ణాభివృద్ధి కావాలి. పది ప్రశ్నలకు లేదా పద్ధతులపైనే దృష్టి సారిస్తే.. సన్నద్ధత కూడా పరిమితంగానే ఉంటుందని, సంపూర్ణ అభ్యాసంపై దృష్టి సారించాలని సలహా ఇచ్చారు.

ముఖ్యంగా పరీక్షల సమయానికి ముందు ఎదురయ్యే ఒత్తిడిని ఎలా అధిగమించాలన్న ప్రశ్నకు ప్రధానమంత్రి సమాధానమిచ్చారు. ఇది అందరికీ ఉన్న సమస్యేనని ఆయన అన్నారు. విద్యను నిర్బంధమైనదిగా లేదా భారంగా పరిగణించకూడదని, దానికి పూర్తిగా నిమగ్నమవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. అసంపూర్ణ విద్య విజయానికి మార్గం కాదన్నారు. మార్కులకే ప్రాధాన్యం ఇవ్వడం గురించి మాట్లాడుతూ.. గతేడాది బోర్డు పరీక్షల్లో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థి పేరు మీకు గుర్తుందా అని ప్రశ్నించారు. దానికి ఓ విద్యార్థి లేదు అని సమాధానమివ్వగా.. మార్కులకు ఎంత తక్కువ ప్రాధాన్యముందో వివరిస్తూ.. అలాంటి విజయాలను కూడా స్వల్పకాలం మాత్రమే మెచ్చుకుంటారని, తర్వాత మరచిపోతారన్నారు. తమ మనసును మార్కులతో ముడిపెట్టుకోవద్దని, తమ జీవితం ఏ వైపు వెళుతుందో దృష్టి సారించాలన్నారు. అలాగే తరగతి గదిలో లేదా పరీక్షాకేంద్రాల్లో మాత్రమే కాకుండా.. జీవితంలో కూడా తమను తాము పరీక్షించుకోవాలని సూచించారు. చదువుకునేటప్పుడు మనసులో ఎన్నో ఆలోచనలు మెదులుతూ, నేర్చుకున్న పాఠాలు కూడా త్వరగా మర్చిపోతున్నాం. ఆ సమయంలో ప్రశాంతంగా, ఏకాగ్రతతో ఎలా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిగిన సంభాషణ సందర్భంగా ఒక విద్యార్థి అడిగారు. చక్కని ఉదాహరణతో ప్రధానమంత్రి ఆ ప్రశ్నకు సమాధానమిచ్చారు. "ఇవాళ మీరు ఇక్కడికి వచ్చారు. సరిగ్గా 25 ఏళ్ల తర్వాత ఎవరైన మిమ్మల్ని ఈ కార్యక్రమం గురించి అడిగితే గుర్తుంటుందా, మర్చిపోతారా?'' అని ప్రధానమంత్రి అడగ్గా.. ఇది ఎంతో ప్రత్యేకమైన సందర్భం కాబట్టి ఎప్పటికీ గుర్తుంటుందని ఆ విద్యార్థి చెప్పారు. అప్పుడు శ్రీ నరేంద్ర మోదీ ఇలా వివరించారు. మీరు ఈ కార్యక్రమంలో పూర్తిగా నిమగ్నమై ఉండటమే అందుకు కారణం. మీరు వర్తమానంలో జీవిస్తూ, ఇక్కడ జరుగుతున్న ప్రతి అంశాన్ని శ్రద్ధగా గమనిస్తున్నారు. ఎప్పుడైతే మనం ఒక పనిలో పూర్తిగా లీనమవుతామో, ఆ జ్ఞాపకాలు మనసులో ఎప్పటికీ గుర్తుండిపోతాయి.

మనం ఒక పనిలో పూర్తిగా నిమగ్నమైనప్పుడు, ఆ అనుభవాలను స్నేహితులతో పంచుకున్నప్పుడు జ్ఞాపకాలు కలకాలం పదిలంగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన వారితో స్నేహం చేసి, వారికి పాఠాలు నేర్పండని విద్యార్థులకు సూచించారు. మీకన్నా తెలివైనవారితో చర్చించి, మీ అవగాహనను మెరుగుపరచుకోండి. ఈ రెండు రకాల ప్రయోజనాల ద్వారా కొత్త ఆలోచనలు రావటమే కాక, మనసు ఉత్సాహంగా ఉండి, ఏకాగ్రత పెరుగుతుందని ఆయన తెలిపారు.

పంజాబ్‌కు చెందిన మరో విద్యార్థి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి గౌరవప్రదంగా అభివాదం చేస్తూ, 12వ తరగతి విద్యార్థులకున్న సవాళ్ల గురించి మాట్లాడారు. ఒకే సమయంలో బోర్డు పరీక్షలు, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవటం, పరీక్షా విధానాలు వేరుగా ఉండటం, ఒకే సమయంలో పరీక్షల షెడ్యూల్ ఉండటం వారికి కష్టంగా ఉంటుందన్నారు. ఆ విద్యార్థి ఆందోళనను అర్థం చేసుకున్న ప్రధానమంత్రి.. దీన్ని ఒకే సమయంలో క్రికెట్, ఫుట్‌బాల్ ఆడటమని అభివర్ణించారు. విద్యార్థులు 12వ తరగతి సిలబస్‌కే ప్రాధాన్యతనివ్వాలని స్పష్టం చేశారు. సిలబస్‌ను పూర్తిగా అవగతం చేసుకుంటే ప్రత్యేక శ్రద్ధ అవసరం లేకుండానే పోటీ పరీక్షలు సులభతరమవుతాయన్నారు. పిల్లలు వారి సామర్థ్యం, నైపుణ్యం, ఆసక్తి మేరకు ఎదిగేలా సహకరించాలని తల్లిదండ్రులకు సూచించారు.

చదువుపై శ్రద్ధ పెట్టాలని సమాజం నుంచి ఒత్తిడి ఉందని, గేమింగ్ రంగంలో భవిష్యత్తుపై ఓ విద్యార్థి ప్రశ్నించారు. దానికి ప్రధానమంత్రి సమాధానమిస్తూ.. మొదట్లో తల్లిదండ్రులు నిరుత్సాహపడినా, ఒకసారి విజయం సాధించిన తర్వాత వాళ్లే గర్వంగా ఆ విజయాన్ని వేడుకగా జరుపుకుంటారని వివరించారు. గేమింగ్ పట్ల ఆసక్తిని ఉత్పాదకత దిశగా మళ్లించాలని ఆ విద్యార్థిని ప్రోత్సహిస్తూ.. పంచతంత్రం, పురాణ గాథల వంటి భారత దేశపు గొప్ప కథల ఆధారంగా కొత్త ఆటలను సృష్టించాలని, వాటికి గుర్తింపు లభించేలా సోషల్ మీడియా వేదికల ద్వారా పంచుకోవాలని ఆయన సూచించారు. గేమింగ్.. కేవలం కాలక్షేపం కాదని, దానికి వేగం, అప్రమత్తత వంటి నైపుణ్యాలు అవసరమని, ఇది స్వీయ అభివృద్ధికి సహకరిస్తుందని వివరించారు. నాణ్యమైన గేమింగ్ లో ప్రావీణ్యం సంపాదించటంపై దృష్టి సారించాలని సూచించారు. గేమింగ్ పేరుతో జరుగుతున్న జూదం పట్ల హెచ్చరిస్తూ, అనైతిక పద్ధతులను అరికట్టటానికి రూపొందించిన చట్టాలను గుర్తు చేస్తూ, గేమింగ్‌ను నిర్మాణాత్మక నైపుణ్యంగా స్వీకరించాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి నివాసాన్ని సందర్శించటం పట్ల విద్యార్థులు ఉత్సాహం కనబరిచారు. ఆయన స్నేహపూర్వక పలకరింపు, విద్యార్థుల ప్రశ్నలపై ఆయన చూపిన ఆసక్తి, వాటికి ఆయన అందించిన ఆలోచింపజేసే సమాధానాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

భయాన్ని బలంగా మార్చుకోవటం - ఒత్తిడి, సమయం, ఆత్మవిశ్వాసాన్ని సమన్వయం చేసుకోవటంఎగ్జామ్ వారియర్ పుస్తకం చదవటం వల్ల పరీక్షలపై తమ దృక్పథం ఎలా మారిందో విద్యార్థులు పంచుకున్నారు. గతంలో పరీక్షలంటే ఒత్తిడి, భయం కలిగేవని, ఈ పుస్తకం చదివిన తర్వాత పరీక్షలు ఒక మిత్రుడిలా మారిపోయాయని ఓ విద్యార్థి పేర్కొన్నారు. గతంలో ఇతరులతో పోల్చుకుని ఆందోళన చెందేవాళ్లమని, తమ శైలి ప్రత్యేకమైనదని, ప్రభావవంతమైందని ఇప్పుడు గ్రహించినట్లు మరో విద్యార్థి తెలిపారు. సమయపాలన ఎప్పుడూ సవాలుగానే ఉండేదని, ఎగ్జామ్ వారియర్ ద్వారా కొన్ని విషయాలు తెలుసుకున్నాక, ఇకపై ఉదయాన్నే నిద్రలేచి పనులను సమర్థవంతంగా నిర్వవించుకోవాలని నిశ్చయించుకున్నామని ఒక విద్యార్థి చెప్పారు.

సమయపాలనకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఒక సులభమైన పద్ధతిని సూచించారు. చేయాల్సిన పనులను రాత్రి పడుకునే ముందు డైరీలో రాసుకుని, మరుసటి రోజు వాటిని సరిచూసుకోవటం, కొన్ని పనులు ఎందుకు పూర్తి కాలేదో విశ్లేషించుకోవాలని చెప్పారు. ఉత్పాదకతతో సమయాన్ని వినియోగించుకోవటం నేర్చుకుంటే ఒత్తిడి, అలసట తొలగిపోతాయని స్పష్టం చేశారు. తనకు ఎన్ని బాధ్యతలున్నప్పటికీ, సరైన సమయపాలన పాటించే అలవాటు వల్లే ఒత్తిడి ఉండదని తెలిపారు.

గణితం వంటి సబ్జెక్టుల పట్ల తమకున్న భయం ఆసక్తిగా ఎలా మారిందో విద్యార్థులు వివరించారు. ఒకప్పుడు గణితం భూతంలా ఉండేది కానీ, ఇప్పుడది ఇష్టమైన సబ్జెక్టు అని ఒక విద్యార్థి తెలిపారు. వేద గణితం గురించి మరింత తెలుసుకోవాలని విద్యార్థులను ప్రధానమంత్రి ప్రోత్సహించారు. ఇది చాలా వినోదాత్మకంగా, మాయా జాలంలా ఉంటుందని అభివర్ణిస్తూ, ఇలాంటి విధానాలను స్నేహితులతో పంచుకోవటం వల్ల వారిలోనూ ఆసక్తిని కలిగించవచ్చని సూచించారు.


ఒకప్పుడు పరీక్షల తేదీలు భయాన్ని కలిగించేవని కానీ, పరీక్షలను పండగలా జరుపుకోవాలి అనే మంత్రం తనలో ఉత్సాహాన్ని నింపిందని మరో విద్యార్థి పంచుకున్నారు. పరీక్షా పే చర్చలో నేర్చుకున్న పాఠాలను కుటుంబసభ్యులతో కూడా పంచుకోవాలని, అవి వారికి కూడా సమాన ప్రయోజనాలను కలిగిస్తాయని ప్రధానమంత్రి సలహా ఇచ్చారు.

తక్కువ మార్కులు వస్తాయేమో అన్న భయాన్ని అధిగమించిన తీరును విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. మార్కులే సర్వస్వం కాదని గ్రహించారు. వైఫల్యాలు ఎదురైనా పట్టుదలతో శ్రమించి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎదిగిన తీరుని వారు ఉదహరణగా చెప్పుకున్నారు. ఒత్తిడి తగ్గితే మెదడు ఉల్లాసంగా మారి పాటలు పాడటం, చిత్రలేఖనం, కవితలు రాయటం వంటి నూతన నైపుణ్యాలను నేర్చుకోవటానికి వీలవుతుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే సృజనాత్మక పనులను ప్రారంభించిన విద్యార్థులను ఆయన ప్రశంసించారు.విద్యార్థులు ప్రసంగాల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టుకోవటానికి పుస్తకాల ద్వారా లభించిన ఆత్మవిశ్వాసం సహాయపడింది. ఒక సాధారణ వ్యక్తి కళ్లతో చూసిన సంఘటనను ఎంత స్పష్టంగా వివరించగలడో.. అలాగే సత్యం, అనుభవం నుంచి ఆత్మవిశ్వాసం లభిస్తుందని ప్రధానమంత్రి వివరించారు. విద్యార్థులు చేసిన కృషి, సాధించిన విజయ సత్యాల నుంచి ఆత్మవిశ్వాసం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

గతంలో సుదీర్ఘమైన లిటరేచర్ పేపర్లు చూసి ఆందోళన కలిగేదని, ఇప్పుడు వేగంగా రాయటం, చేతి రాతను మెరుగుపరుచుకోవటం ప్రాక్టీస్ చేస్తున్నట్లు ఒక విద్యార్థి పంచుకున్నారు. దీనిపై స్పందించిన ప్రధానమంత్రి.. ప్రశ్నాపత్రానికి జవాబులను రాయటం ప్రారంభించే ముందు 30 సెకన్లపాటు ప్రశాంతంగా ఉండాలని, దీర్ఘంగా శ్వాస తీసుకుని మనసుని ప్రశాంతంగా ఉంచుకోవాలని, జ్ఞానం లేకపోవటం వల్ల కాదు.. తొందరపాటు వల్లే పరీక్షల్లో తప్పులు జరుగుతాయని ఆయన తెలిపారు.

# 12 మున్సిపాలిటీ ఎన్నికల బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి

## -గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి



వరంగల్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వరంగల్ జిల్లా లోని 12 మున్సిపాలిటీ ఎన్నికల బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి విజ్ఞప్తి చేసారు. శుక్రవారం మీడియా తో మాట్లాడుతూ 42 శాతం బీసీలకు అభ్యర్థులకు మున్సిపల్ టికెట్లు ఇచ్చారు బిజెపి గాని టిఆర్ఎస్ గాని 42 శాతం బీసీలకు టికెట్లు ఇవ్వలేదు రెండు పార్టీలు బీసీలకు మోసం చేసింది అందుకే ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు అందరూ కలిసి 12 మున్సిపాలిటీ కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించగలరని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశం లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్. అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిదో వార్డులో భూగర్భ జలాలను కాపాడుతా


## - ఎనిమిదో వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సిహెచ్ రేణుక శ్రీనివాస్ గౌడ్



సదాశివపేట ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో మునిసిపల్ ఎన్నికల ప్రచార ంలో భాగంగా ఎనిమిదో వార్డు లో ఉన్న ప్రజా సమస్యలను ప్రచారంలో తన ప్రచారాన్ని కోన సాగించారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సిహెచ్ రేణుక శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఎనిమిదవ వార్డు సూచనల మేరకు ఎనిమిదో వార్డులో భూగర్భ జలాలను కాపాడుతా, చట్టాన్ని ఆశ్రయిస్తా, ఎనిమిదో వార్డు ప్రజలకు న్యాయం చేస్తా నన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అండదండలతో ఎనిమిదవ వార్డ ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం- న్యాయవాది కోవూరి సత్యానారాయణ గౌడ్ మాట్లాడుతూ 8వ వార్డు ప్రజలే దేవుళ్ళు అని కొనియాడుతూ వారికి సేవ చేయడానికి వాళ్ళ కష్టాలు తీర్చడానికి సంపూర్ణ కృషితో చట్టాన్ని అనుసరించి, తూర్పు జయప్రకాష్ రెడ్డి అండదండలతో ఎనిమిదో వార్డ అభివృద్ధిని సాధిస్తామని తెలియజేశారు. 8వ వార్డు ప్రజల ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలియజేశారు. అదేవిధంగా ఎనిమిదవ వార్డు ప్రజలు సిహెచ్ రేణుక శ్రీనివాస్ గౌడ్ గారిని అఖండ విజయంతో గెలిపిస్తామని 8వ వార్డు సమస్యలను పరిష్కరించేందుకు జగ్గారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు న్యాయం చేస్తా నన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చింటూ గౌడ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎంత దూరమైనా వెళ్తా, 8వ వార్డులో భూగర్భ జలాలను కాపాడుతా, అవినీతి పరులకు తగిన బుద్ధి చెబుతా, ఎనిమిదో వార్డులో ఎనిమిదవ వార్డ ప్రజల అండదండలతో వారి సమస్యలను పరిష్కరించి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తా మన్నారు. ఈ గెలుపు ఎనిమిదో వార్డు ప్రజలదే అని తెలియజేశారు. ప్రచారంలో భాగంగా ఎనిమిదవ వార్డు ఇంచార్జ్ చింటూ గౌడ్ మాట్లాడుతూ 8వ వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తూచా తప్పకుండా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గం రాష్ట్ర కార్యవర్గం పనిచేస్తుందని ఎనిమిదో వార్డు ప్రజల అభివృద్ధికి తూర్పు జయప్రకాశ్ రెడ్డి అండదండలు ఉంటాయని తెలియజేశారు. ఈ యొక్క ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీశైలం, నవాజ్, వసీం, షరీఫ్, రజాక్, మరియు కాంగ్రెస్ పార్టీ మహిళామూర్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వాషింగ్టన్ పోస్టు దినపత్రికలో 300 మంది తొలగింపు..

న్యూయార్క్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కుమారుడు ఇషాన్ థరూర్ ను ఉద్యోగం నుంచి తొలగించారు. అమెరికాకు చెందిన ద వాషింగ్టన్ పోస్టు దినపత్రికలో ఇషాన్ థరూర్ జర్నలిస్టుగా చేస్తున్నారు. ఆ సంస్థలో తాజాగా ఉద్యోగుల్ని తొలగించారు. మూడో వంతు అంటే సుమారు 300 మందిపై వేటు వేశారు. ఎడిటోరియల్ సిబ్బందికి చెందిన మూడో వంతు మందిని తొలగించడంతో ఆ సంస్థపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. జర్నలిజం భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారినట్లు ఆందోళనకు గురవుతున్నారు.వాషింగ్టన్ పోస్టు పత్రికకు చెందిన విదేశీ బ్యూరో, లోకల్ రిపోర్టింగ్ బృందాలు, స్పోర్ట్స్ డెస్క్, బిజినెస్ డివిజన్‌లో చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఎంపీ శశిథరూర్ కుమారుడు ఇషాన్ థరూర్.. ఆ పత్రికకు చెందిన అంతర్జాతీయ వ్యవహారాల్లో సీనియర్ కాలమిస్టుగా ఉన్నారు. తన ఉద్యోగం కోల్పోయిన విషయాన్ని ఇషాన తన ఎక్స్ అకౌంట్లో షేర్ చేశారు. చీకట్లో ప్రజాస్వామ్యం మరణిస్తుందని తన పోస్టుకు క్యాప్షన్ ఇచ్చారు.అయితే ఆ పోస్టును శశిథరూర్ మళ్లీ షేర్ చేశారు. బ్యాడ్ డే అంటూ పేర్కొన్నారు. వరల్డ్ వ్యూవ్ కాలమ్‌ను 2017లో ఇషాన్ థారూర్ స్టార్ట్ చేశారు.

# గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట..



అమరావతి, ఫిబ్రవరి 7: గ్రామీణ క్రీడల కారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు .ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలో నియోజకవర్గం క్రీడల్లో కబడ్డీ పోటీలలో పాల్గొన్న మండల కేంద్రానికి చెందిన బండి శ్రీనిధి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు .

ఈ సందర్భంగా ఆమెను మండల కేంద్రంలో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల నైపుణ్యతను బయటకు తీసేందుకు ప్రభుత్వం సీఎం క్రీడలను నిర్వహిస్తుందని గుర్తు చేశారు. ఇట్టి పోటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఎంతోమంది క్రీడాకారులు తమ నైపుణ్యతను బయటకు తీసుకు వచ్చారని గుర్తు చేశారు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. చదువుతోపాటు క్రీడలలో రాణించాలని ఆయన సూచించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల తో పాటు జూనియర్ కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించిందని గుర్తు చేశారు. క్రీడాకారులు ఆయా రంగాలలో ముందుకు పోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన సూచించారు. క్రీడాకారులు తమ ప్రతిభను మరింత ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. పేద క్రీడాకారులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దయాకర్ రెడ్డి పలువురు క్రీడాకారులు ఉన్నారు.

# ఆదరించి మరో అవకాశం ఇవ్వండి మరింత అభివృద్ధి చేస్తా

అమరావతి, ఫిబ్రవరి 7: మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డు అభివృద్ధి కోసం తనకు ఆదరించి ఆశీర్వదించి మరోసారి గెలిపించండి మరింత అభివృద్ధి చేస్తానని బిజెపి అభ్యర్థి బాల్చేడ్ పావని మల్లికార్జున్ అన్నారు. శనివారం వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా మద్దతుదారులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులతోనే మున్సిపాలిటీలు అభివృద్ధి సాధ్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు ఎలాంటి నిధులు ఇవ్వద్దని గుర్తు చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పాలమూరు ఎంపీ డీకే. అరుణ మద్దతుతో మక్తల్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడం బిజెపికే సాధ్యమని అన్నారు.

13వ వార్డులో అనేక సమస్యలు పరిష్కరించామని మరోసారి అవకాశం కల్పించండి మిగిలిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు .మిషన్ భగీరథ పైప్లైన్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడమే తన ధ్యేయమని అన్నారు. అదేవిధంగా వార్డులో నెలకొన్న వివిధ సమస్యలు ,పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. మరోసారి గెలిపించి అవకాశం ఇవ్వాలని కోరారు.

ఈ నెల 11న జరగనున్న ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి 13వ వార్డు కౌన్సిలర్ గా తనను గెలిపించాలని బాల్చేడ్ పావని మల్లికార్జున్ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బి. ఆంజనేయులు సూర్య, మహేష్ సాగర్ ,వన్నవాడ శ్రీకాంత్ ,గోపాల్ , నారాయణ, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

# భారత్, అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం ముసాయిదాను స్వాగతించిన ప్రధానమంత్రి.. 'మేక్ ఇన్ ఇండియా', ఉపాధి కల్పనకు ఊతం: ప్రధాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: భారతదేశం, అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి కుదిరిన ముసాయిదాను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ స్వాగతించారు. ఈ పరిణామం ఇరుదేశాలకు గొప్ప శుభవార్త అన్నారు.

భారత్–అమెరికా సంబంధాలను బలోపేతం చేయడంలో డొనాల్డ్ ట్రంప్ చూపిన వ్యక్తిగత నిబద్ధతకు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యాచరణ ఇరుదేశాల భాగస్వా మ్యంలో పెరుగుతున్న సాన్నిహిత్యం, విశ్వాసం, శక్తిమంతమైన మార్పుని ప్రతిబింబిస్తోందన్నారు.

ఈ ఒప్పందం రైతులకు, పారిశ్రామికవేత్తలకు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ ఆవిష్కర్తలకు, మత్స్యకారులకు నూతన అవకాశాలను కల్పించటంతో 'మేక్ ఇన్ ఇండియా' బలోపేతం అవటమే కాక, మహిళలకు, యువతకు పెద్దఎత్తున ఉపాధి లభిస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

పెట్టుబడులను, సాంకేతిక భాగస్వామ్యాలను ఈ కార్యాచరణ మరింత బలోపేతం చేస్తుందని.. స్థిరత్వం, విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలను పటిష్ఠం చేస్తుందని, అలాగే ప్రపంచ వృద్ధికి దోహదపడుతుందని ఆయన చెప్పారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా భారతదేశ ఆకాంక్షను ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రజల సాధికారతకు, సామూహిక వృద్ధికి తోడ్పడే ప్రపంచ భాగస్వామ్యాలకు భారత్ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.

భారత్, అమెరికా మధ్య కుదిరిన తాత్కాలిక ఒప్పందానికి సంబంధించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన పోస్టుకు స్పందిస్తూ, శ్రీ నరేంద్ర మోదీ ఇలా పేర్కొన్నారు;

రెండు దేశాల మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి రూపొందించిన ముసాయిదాపై మేం ఏకాభిప్రాయానికి వచ్చాం. మన దేశాల మధ్య పటిష్ఠమైన సంబంధాల కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చూపిన వ్యక్తిగత నిబద్ధతకు ధన్యవాదాలు.

ఈ కార్యాచరణ ఇరు దేశాల భాగస్వామ్యంలో పెరుగుతున్న సాన్నిహిత్యం, విశ్వాసం, శక్తిమంతమైన మార్పుని ప్రతిబింబిస్తోంది. దీని ద్వారా రైతులకు, పారిశ్రామికవేత్తలకు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ ఆవిష్కర్తలకు, మత్స్యకారులకు నూతన అవకాశాలు ఏర్పడటం వల్ల 'మేక్ ఇన్ ఇండియా' బలోపేతం అవుతుంది. మహిళలకు, యువతకు పెద్దఎత్తున ఉపాధి లభిస్తుంది.

భారత్, అమెరికా దేశాలు ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యతనిస్తున్నాయి. ఈ కార్యాచరణ మన మధ్య పెట్టుబడులను, సాంకేతిక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేస్తుంది.

ఈ ముసాయిదా ద్వారా స్థిరత్వం, విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలు పటిష్టమవటమే కాక, ప్రపంచ వృద్ధికి దోహదపడుతుంది. వికసిత్ భారత్ లక్ష్యంగా భారతదేశం అడుగులు వేస్తున్న తరుణంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రజల సాధికారతకు, సామూహిక వృద్ధికి తోడ్పడే ప్రపంచ భాగస్వామ్యాల నిర్మాణానికి మేం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాం.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ..

## –స్పీకర్‌కు మరో 3 వారాలు గడువు ఇచ్చిన సుప్రీంకోర్టు

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు చివరిగా మరో అవకాశం ఇచ్చింది. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణీత కాలంలో నిర్ణయం తీసుకోవాలని సూచిస్తూ మూడు వారాల గడువునిచ్చింది. అనంతరం విచారణను వాయిదా వేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ దాఖలుచేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టారు. గత విచారణ సందర్భంగా.. అనర్హత అంశాన్ని తేల్చాలని ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తిచేసి కోర్టుకు నివేదిక సమర్పించాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో గత విచారణ తర్వాత జరిగిన పరిణామాలను సుప్రీంకోర్టుకు ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇప్పటికే విచారణ జరుపుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఒక ఎమ్మెల్యే అనర్హత పిటిషన్ విచారణ జరిగిందని, ఇంకో ఇద్దరు ఎమ్మెల్యేల విచారణ జరుగుతుందని అభిషేక్ సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గడువు పొడిగించాలని ధర్మాసనాన్ని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ధర్మాసనం.. మూడు వారాల సమయాన్ని ఇచ్చింది. నిర్ణీత గడువు తర్వాత కూడా స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించకపోతే, కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. అనంతరం విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

# సముద్ర, గగనతల పరమైన సమన్వయ ఆపరేషన్ ద్వారా అంతర్జాతీయ చమురు స్మగ్లింగ్ రాకెట్‌ను పట్టుకున్న ఇండియన్ కోస్ట్ గార్డ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: అంతర్జాతీయ చమురు స్మగ్లింగ్ రాకెట్‌ను భారత తీర రక్షక దళం (ఐసీజీ) విజయవంతంగా ఛేదించింది. ఫిబ్రవరి 5, 6 తేదీల్లో సముద్ర, గగనతల బృందాల సమన్వయంతో అత్యంత పకడ్బందీగా చేపట్టిన ఆపరేషన్ ద్వారా యుద్ధం, ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాల నుంచి పెద్దఎత్తున చమురు, చమురు ఆధారిత కార్గోను అక్రమంగా తరలిస్తున్న ముఠాను ఈ ఆపరేషన్ అడ్డుకుంది.

ఫిబ్రవరి 5, 2026న ముంబైకి పశ్చిమాన సుమారు 100 నాటికల్ మైళ్ల దూరంలో మూడు అనుమానాస్పద నౌకలను భారత కోస్ట్ గార్డ్ నౌకలు అడ్డుకున్నాయి. వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేయటం, వాటిలో లభించిన ఎలక్ట్రానిక్ డేటాను విశ్లేషించటం, పత్రాల ధ్రువీకరణ, సిబ్బందిని విచారించటం ద్వారా ఐసీజీ స్పెషలిస్ట్ బోర్డింగ్ బృందాలు ఈ నేరానికి సంబంధించిన పూర్తి వ్యవస్థను, నేరగాళ్లు అనుసరించిన పద్ధతిని తెలుసుకోగలిగాయి.

ఈ స్మగ్లింగ్ ముఠా, తక్కువ ధరకు లభించే చమురును సముద్రంలో నౌకల ద్వారా రవాణా చేసి, అంతర్జాతీయ జలాల్లో మోటార్ ట్యాంకర్లలోకి మార్చేవారు. ఈ ముఠాలో వివిధ దేశాలకు చెందిన హ్యాండ్లర్లు ఉన్నట్లు, వారు సముద్రం మధ్యలో నౌకల ద్వారా సరుకు అమ్మకాలు, బదిలీలను నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

భారత ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఈజడ్) పరిధిలో అనుమానాస్పదంగా ఉన్న మోటార్ ట్యాంకర్‌ను ఐసీజీ అత్యాధునిక సాంకేతిక నిఘా వ్యవస్థలు గుర్తించాయి. దీని ఆధారంగా చేపట్టిన డిజిటల్ విచారణ, నౌకల కదలికల విశ్లేషణలో.. ఆ ట్యాంకర్ వద్దకు మరో రెండు నౌకలు వచ్చినట్లు తెలిసింది. భారత్ సహా తీరప్రాంత దేశాలకు చెల్లించాల్సిన సుంకాలను ఎగ్గొట్టేందుకు, చట్టవిరుద్ధంగా ఒక నౌక నుంచి మరో నౌక లోకి చమురును బదిలీ చేస్తున్నట్లు అనుమానం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలోనే ఆపరేషన్‌ను ప్రారంభించారు.

ఫిబ్రవరి 5, 2026న స్వయంగా నౌకల వద్దకు వెళ్లి డిజిటల్ సాక్ష్యాలను ధ్రువీకరించుకున్న తర్వాత, మూడు నౌకలను అదుపులోకి తీసుకున్నారు. సముద్ర చట్టాలను అమలు చేసే సంస్థల నుంచి తప్పించుకునేందుకు ఈ నౌకలు తరచుగా గుర్తింపును మారుస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అంతేకాక, ఈ నౌకల యజమానులు విదేశాల్లో ఉన్నట్లు దర్యాప్తు ద్వారా తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న ఈ నౌకలను తదుపరి విచారణకు ముంబైకి తరలించే అవకాశముంది.

చట్టపరమైన చర్యల నిమిత్తం వీటిని భారత కస్టమ్స్, ఇతర చట్ట అమలు సంస్థలకు అప్పగించనున్నారు.

అత్యాధునిక డిజిటల్ నిఘా ద్వారా ప్రారంభమై, భారత తీరరక్షక దళం విస్తృత సముద్రయాన ఉనికితో అమలైన ఈ ఆపరేషన్, సముద్ర తీర ప్రాంతంలో 'ప్రధాన భద్రతా ప్రదాత'గా, అంతర్జాతీయ సముద్ర నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేసే శక్తిగా భారతదేశ పాత్రను మరోసారి స్పష్టం చేసింది.

# తూప్రాన్ అభివృద్ధి బాధ్యత నాది.. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హరీష్ రావు



మెదక్, ఫిబ్రవరి 7: తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అల్లాపూర్ చౌరస్తా నుండి తూప్రాన్ బస్టాండ్ వరకు మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. తూప్రాన్ అభివృద్ధిని గుర్తు చేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనను ఎండగట్టారు.

ఒకప్పుడు తూప్రాన్‌లో మంచినీళ్లు కావాలంటే మూడు రోజులకోసారి వచ్చేవి. గీతారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బిందెలతో అడ్డం పడి నిరసన తెలిపేవాళ్లు. కానీ కేసీఆర్ వచ్చాక ప్రతి ఇంటికి నల్లా పెట్టి ఆడబిడ్డల నీళ్ల కష్టాలు తీర్చారని హరీష్ రావు అన్నారు. తూప్రాన్‌ను మున్సిపాలిటీ చేసింది, ఆర్డీవో ఆఫీస్ తెచ్చింది, ఫోర్ లైన్ రోడ్లు వేసి హైవేలా మార్చింది కారు గుర్తు కాదా.. కేసీఆర్ రాకముందు తూప్రాన్‌కు పిల్లనియ్యాలంటే నీళ్లు మోపిస్తారని భయపడేవాళ్లు. ఇప్పుడు తూప్రాన్‌కే పిల్లనియ్యాలన్నట్టు పరిస్థితి మారింది. పది లక్షలు లేని భూమిని కోటి రూపాయలు చేసింది కేసీఆర్. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు పాతాళానికి, బంగారం ధరలు ఆకాశానికి చేరాయి.

ఆధిపత్యం కోసం ప్రజలను బలి చేస్తున్నారు.

తూప్రాన్‌లో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని హరీష్ రావు అన్నారు. నర్సారెడ్డి, మైనంపల్లి మధ్య ఆధిపత్యం కోసం ప్రజలను బలి చేస్తున్నారు. మీకు ఆధిపత్య రాజకీయాలు కావాలా.. లేక అభివృద్ధి కావాలా.. ఆలోచించండి. రెండేళ్ల నుంచి తూప్రాన్ అభివృద్ధిని అడ్డుకున్నారు. రోడ్లకు గుంతలు పడితే డాంబర్ వేసే దిక్కు కూడా ఈ ప్రభుత్వానికి లేదు. 50 పడకల ఆసుపత్రిలో డాక్టర్లు లేక మెదక్, గజ్వేల్ కు పంపుతున్నారు. మహిళలకు రూ. 2500 ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేశాడు. ఈ 26 నెలల్లో ఒక్కో అక్కకు, చెల్లెకు రూ. 65,000 బాకీ పడ్డాడు. తులం బంగారం ఇస్తానని చెప్పి కల్యాణ లక్ష్మి చెక్కులను కూడా ఆపుతున్నాడు.

అవ్వాతాతలకు, బీడీ కార్మికులకు, చేనేత, గీత కార్మికులకు, డయాలసిస్ పేషెంట్లకు రూ. 2000 పెన్షన్ ఇచ్చి కడుపులో పెట్టుకుంది కేసీఆర్ అని అన్నారు. రేవంత్ రెడ్డి రూ. 4000 ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు పంట పంటకు రైతుబంధు పడేది. కరోనా కష్ట కాలంలో కూడా ఆప లేదు. రేవంత్ రెడ్డి రెండు రైతుబంధులు ఎగ్గొట్టాడు. బతుకమ్మ చీరలు బంద్, కేసీఆర్ కిట్ బంద్, గొర్రెల పంపిణీ బంద్, చేప పిల్లలు బంద్, దళిత బంధు బంద్.. అన్నీ బంద్ పెట్టి ప్రజలను గోస పెడుతున్నాడు. సద్ది తిన్న రేవు తలవాలి.. మనకు అన్నం పెట్టిన కేసీఆర్‌ను మర్చిపోవద్దు.

ఐదేళ్ల కోసం కౌన్సిలర్లను గెలిపించండి..

బీజేపీ వాళ్లు ఓట్ల కోసం గిర్ర గిర్ర తిరుగుతున్నారు. వాళ్లు తూప్రాన్‌కు ఏమైనా చేశారా.. ఒక్క హాస్పిటల్ కట్టించారా.. కల్యాణ లక్ష్మి ఇచ్చారా.. అని హరీష్ రావు ప్రశ్నించారు. రూ. 15 లక్షలు వేస్తామని 12 ఏళ్లుగా మోసం చేస్తున్నారు.

తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు ఇవ్వలేదు. పువ్వు గుర్తుకు ఓటేసినా, ఓటును మోరీలో పారేసినా ఒక్కటే. అది దండుగ అని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డికి కండ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నాడు. పెన్షన్ ఎప్పుడు ఇస్తావ్ అని అడిగితే లాగుల తొండలు ఇడుస్తా అంటాడు. హామీలు అడిగితే పేగులు మెడలో వేసుకుంటా అంటాడు. తులం బంగారం ఏది అంటే గుడ్లు పీకి గోటీలు ఆడుతా అంటాడు.

ఇది ఒక ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా.. ఇలాంటి బూతుల ముఖ్యమంత్రికి ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలి. ఐదేళ్ల కోసం కౌన్సిలర్లను గెలిపించండి. రెండేళ్ల తర్వాత వచ్చేది మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే. తూప్రాన్ అభివృద్ధి బాధ్యత నాది. ఏ పని ఉన్నా నేను చేసి పెడతానని హామీనిచ్చారు.

# రీల్స్ మోజులో తల్లి పిచ్చి పని.. సజ్జనార్ సీరియస్

హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); సోషల్‌మీడియా వాడకం పెరిగిపోయాక.. చాలా మంది దానికి అడిక్ట్ అవుతున్నారు. తమకు ఫాలోవర్లు, రీచ్ పెరగడం కోసం పిచ్చి పనులు చేసేవారు చాలా మందే ఉన్నారు. ఇందుకోసం తమ ప్రాణాలనే రిస్క్‌లో పెట్టేవాళ్లు లేకపోలేదు. అయితే రీల్స్ మోజులో పడి ఓ తల్లి చేసిన పనికి హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ సీరియస్ అయ్యారు. ఓ తల్లి బావి అంచుపై నిలుచొని ఇద్దరు పిల్లల్ని చేతులతో పట్టుకొని.. చాలా ప్రమాదకరంగా రీల్ చేసింది. ఇది సజ్జనార్ కంట పడింది. దీంతో ఆయన ఆ వీడియోని షేర్ చేస్తూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు వీడియోని ఎక్స్‌లో పోస్ట్ చేసిన సజ్జనార్ "ఇది సోషల్ మీడియా ఉన్మాదానికి పరాకాష్ట! కన్నబిడ్డలను బావి అంచున నిలబెట్టి రీల్స్ చేయడం సాహసం కాదు.. అది మూర్ఖత్వం. ఆత్మహత్యాసదృశ్యం. పిల్లలకు రక్షణగా ఉండాల్సిన పెద్దలే వారిని మృత్యువు అంచున నిలబెట్టడం చూస్తుంటే, సమాజం ఎటు పోతుందో అర్థం కావడం లేదు. సోషల్ మీడియా పిచ్చిని ప్రాణాల మీదకు తెచ్చుకోకండి.


# ఇండియా–అమెరికా ట్రేడ్ డీల్.. వీటిపై జీరో టారిఫ్‌లు.. లిస్ట్ వెల్లడించిన పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఇండియా–అమెరికా ట్రేడ్ డీల్ అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా టారిఫ్‌లను ట్రంప్ తగ్గించాడు. నేటి నుంచే ఈ టారిఫ్‌లు అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏయే ఉత్పత్తులపై ఎలాంటి పన్నులు ఉంటాయి.. అవి ఇండియాకు ఎలాంటి మేలు కలిగిస్తాయి అనే అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య పన్నులు, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శనివారం స్పందించారు.

ఇండియా–అమెరికా మధ్య కొన్ని ఉత్పత్తులపై సున్నా శాతం సుంకాలు విధించే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ట్రేడ్ డీల్ వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. రైతులకు నష్టం కలగకుండా కొన్ని ఉత్పత్తుల్ని డీల్‌కు దూరంగా ఉంచినట్లు చెప్పారు. ఇండియా నుంచి ఎగుమతి అయ్యే సోయాబీన్ ఆయిల్‌పై పరిమిత కోటా వరకు జీరో టారిఫ్‌లు ఉంటాయి. అలాగే అమెరికా నుంచి దిగుమతి చేసుకునే యాపిల్స్‌పై కూడా సున్నా సుంకాలుంటాయి. సుంకాలు లేకుండా కనీసం 80 రూపాయలకు కేజీ యాపిల్స్ దిగుమతి చేసుకుంటారు. అలాగే వైన్స్, ఆల్కహాల్ (డ్రింక్స్), పప్పు ధాన్యాలు, క్యాన్సర్ (డ్రగ్స్), కెమికల్స్, మెడికల్ డివైజెస్ వంటివి జీరో టారిఫ్స్ కిందకు వస్తాయి. వీటి దిగుమతులపై ఎలాంటి పన్ను ఉండదు. దీంతో ఇవి భారత మార్కెట్లో చవకగా లభిస్తాయి. అలాగే ఇండియా నుంచి ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తులు, రత్నాలు, వజ్రాలు వంటి వాటిపై అమెరికా ఎలాంటి టారిఫ్‌లు విధించదు.

అలాగే మన దేశం నుంచి భారీగా ఎగుమతి చేసే స్మార్ట్‌ఫోన్లపై కూడా సున్నా సుంకాలే.

# సముద్రం మధ్యలో ఆయిల్ స్మగ్లింగ్.. వెంటాడి ముఠాను పట్టుకున్న ఇండియన్ కోస్ట్ గార్డ్స్




ముంబై, ఫిబ్రవరి 7: ముంబై తీరం, అరేబియా సముద్రం మధ్యలో ఆయిల్ స్మగ్లింగ్ ముఠాను ఇండియన్ కోస్ట్ గార్డ్స్ (భారతీయ తీర రక్షక దళం) పట్టుకున్నారు. పశ్చిమ ముంబైకి 100 నాటికల్ మైళ్ల దూరంలో ఆయిల్ రవాణా జరుగుతుండగా, శుక్రవారం సీ–ఎయిర్ ఆపరేషన్ నిర్వహించి ఈ ముఠాను పట్టుకున్నట్లు ఇండియన్ కోస్ట్ గార్డ్ వెల్లడించింది.

కోస్ట్ గార్డ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సముద్రం మధ్యలో కొన్ని నౌకల ద్వారా అక్రమంగా ఆయిల్ స్మగ్లింగ్ జరుగుతోంది. అంతర్జాతీయంగా ఆయిల్ అమ్మకాలపై ఆంక్షలు ఉన్న దేశాల నుంచి వచ్చే నాసిరకం చమురును స్మగ్లింగ్ ముఠా సేకరిస్తుంది. సముద్రం మధ్యలోనే.. ఒక నౌక నుంచి మరో నౌకలోకి ఆయిల్‌ను మార్చి తీరానికి దగ్గరలో ఉన్న రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీని ద్వారా భారీ స్థాయిలో పన్నులు ఎగ్గొడుతున్నారు. లేటెస్ట్ టెక్నాలజీ, నిఘా పరికరాలు, ఇతర డాటా ఆధారంగా కోస్ట్ గార్డ్స్ ఈ ఆపరేషన్ నిర్వహించారు. మూడు అనుమానిత నౌకలను కోస్ట్ గార్డ్స్ నౌకలు చుట్టుముట్టి తనిఖీ చేశాయి.

డాక్యుమెంట్లు తనిఖీ చేయగా.. ఆయిల్ అక్రమ రవాణాను గుర్తించాయి. ఇదో అంతర్జాతీయ నెట్‌వర్క్ అని అనుమానిస్తున్నారు. ఈ ఆయిల్ అక్రమ రవాణాలో అనేక దేశాల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. నౌకలతోపాటు అందులోని సిబ్బందిని స్వాధీనం చేసుకున్న కోస్ట్ గార్డ్స్ తీరానికి తరలించారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు తెలిపారు.

# అమెరికా - భారత్ ఉమ్మడి ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్యం, సుంకాల విషయంలో రెండు దేశాల మధ్య ఒక మధ్యంతర ఒప్పందం (ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఇంటరిం అగ్రిమెంట్) కుదిరిందని ప్రకటిస్తున్నందుకు అమెరికా, భారత్ సంతోషిస్తున్నాయి. 2025 ఫిబ్రవరి 13న అధ్యక్షుడు డోనాల్డ్ జే. ట్రంప్, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన విస్తృతమైన 'అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం' చర్చల పట్ల ఉన్న నిబద్ధతను నేటి ఫ్రేమ్‌వర్క్ పునరుద్ఘాటిస్తోంది. ఈ ద్వైపాక్షిక ఒప్పందంలో అదనపు మార్కెట్‌ను అందుబాటులో ఉంచటం, మరింత పటిష్ఠమైన సరఫరా వ్యవస్థల ఏర్పాటు వంటి అంశాలు ఉంటాయి. అమెరికా, భారత్ మధ్య కుదిరిన ఈ మధ్యంతర ఒప్పందం మన దేశాల భాగస్వామ్యంలో ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని సూచిస్తుంది. ఇది పరస్పర ప్రయోజనాలు, స్పష్టమైన ఫలితాల ఆధారంగా సమతుల్య వాణిజ్యం పట్ల మనకున్న ఉమ్మడి నిబద్ధతను చాటి చెబుతుంది.

అమెరికా, భారత్ మధ్య కుదిరిన మధ్యంతర ఒప్పం దంలోని ప్రధాన నిబంధనలు:

డ్రైడ్ డిస్టిలర్స్ గ్రెయిన్స్ (డీడీజీ), పశుగ్రాసం కోసం ఉపయోగించే ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా పండ్లు, ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ ఆయిల్, వైన్, స్పిరిట్స్, ఇతర ఉత్పత్తులతో పాటు అన్ని రకాల అమెరికన్ పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి ఆహార- వ్యవసాయ ఉత్పత్తులపై భారతదేశం సుంకాలను తొలగిస్తుంది లేదా తగ్గిస్తుంది.

2025 ఏప్రిల్ 2 నాటి కార్యనిర్వాహక ఉత్తర్వు 14257ను (అమెరికా వస్తువుల విషయంలో వాణిజ్య లోటును తగ్గించేందుకు పరస్పర సుంకాలను విధిస్తూ దిగుమతులను నియంత్రించడం) సవరించటం ద్వారా వస్త్రాలు- దుస్తులు, తోలు - పాదరక్షలు, ప్లాస్టిక్ - రబ్బరు, ఆర్గానిక్ రసాయనాలు, ఇంటి అలంకరణ వస్తువులు, హస్తకళా ఉత్పత్తులు, కొన్ని రకాల యంత్రాలతో సహా భారత్ నుంచి దిగుమతయ్యే వస్తువులపై 18 శాతం పరస్పర సుంకాన్ని అమెరికా విధిస్తుంది. ఈ మధ్యంతర ఒప్పందం విజయవంతంగా చేసుకున్న తర్వాత 2025 సెప్టెంబర్ 5 నాటి కార్యనిర్వాహక ఉత్తర్వు- 14346 (పరస్పర సుంకాల పరిధిని మార్చటం, వాణిజ్య - భద్రతా ఒప్పందాల అమలు కోసం విధానాలను రూపొందించడం) కింద జెనరిక్ మందులు, రత్నాలు, వజ్రాలు, విమాన విడిభాగాలతో సహా గుర్తించిన పలు వస్తువులపై అమెరికా ఈ పరస్పర సుంకాన్ని పూర్తిగా తొలగిస్తుంది.

2018 మార్చి 8 నాటి ప్రకటన 9704 (అమెరికాలోకి అల్యూమినియం దిగుమతులు), 2018 మార్చి 8 నాటి ప్రకటన 9705 (అమెరికాలోకి ఉక్కు దిగుమతులు), 2025 జూలై 30 నాటి ప్రకటన 10962ల (అమెరికాలోకి రాగి దిగుమతులు) కింద అమెరికా జాతీయ భద్రతకు ముప్పు ఉందనే కారణంతో నిర్దేశించిన విమానాలు, విమాన విడిభాగాలపై విధించిన సుంకాలను కూడా అమెరికా రద్దు చేస్తుంది. అమెరికా జాతీయ భద్రతా అవసరాలకు అనుగుణంగా 2019 మే 17 నాటి ప్రకటన 9888ను (ఆటోమొబైల్స్, ఆటో విడిభాగాల దిగుమతులు) సవరించటం ద్వారా భారతీయ ఆటో విడిభాగాలకు 'ప్రాధాన్యత ప్రతిపాదికన'(ప్రిఫరెన్షియల్ టారిఫ్ రేట్ కోటా) ప్రవేశం లభిస్తుంది. ఇక ఫార్మాస్యూటికల్స్, ఫార్మా పదార్థాలపై అమెరికా నిర్వహిస్తున్న 'సెక్షన్ 232' విచారణ ఫలితాలను బట్టి జెనరిక్ ఔషధాలు, వాటి తయారీలో వాడే ముడి పదార్థాల విషయంలో భారతదేశానికి చర్చల ద్వారా సానుకూల ప్రభావం ఉంటుంది.

ఆసక్తి ఉన్న రంగాల్లో నిరంతర ప్రాతిపదికన పరస్పర ప్రాధాన్యత క్రమంలో మార్కెట్‌ను అందుబాటులో ఉంచేందుకు అమెరికా, భారత్ అంగీక రించాయి.

ఈ ఒప్పందం ద్వారా కలిగే ప్రయోజనాలు ప్రధానంగా అమెరికా, భారతదేశానికే దక్కేలా రెండు దేశాలు 'రూల్స్ ఆఫ్ ఆరిజిన్'ను రూపొందించుకుంటాయి.

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రభావితం చేసే సుంకాలు కాని అడ్డంకులను రెండు దేశాలు పరిష్కరించుకుంటాయి. ఇందులో భాగంగా అమెరికన్ వైద్య పరికరాల వాణిజ్యంలో దీర్ఘకాలంగా ఉన్న అడ్డంకులను తొలగించడానికి భారతదేశం అంగీకరించింది. అమెరికన్ సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) వస్తువులు మార్కెట్లోకి అందుబాటులోకి రావటాన్ని ఆలస్యం చేసే లేదా పరిమాణాత్మక పరిమితులను విధించే కఠినమైన 'ఇంపోర్ట్ లైసెన్సింగ్' విధానాలను భారత్ రద్దు చేస్తుంది. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చిన ఆరు నెలల లోపు గుర్తించిన రంగాల్లో అమెరికా అభివృద్ధి చేసిన లేదా అంతర్జాతీయ ప్రమాణాలు (టెస్టింగ్ అవసరాలతో సహా).. భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించే అమెరికన్ ఎగుమతులకు ఆమోదయోగ్యంగా ఉంటాయా లేదా అనే అంశాన్ని సానుకూల దృక్పథంతో భారత్ నిర్ణయిస్తుంది. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేయటానికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తిస్తూ.. అమెరికన్ ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యానికి అడ్డంకిగా ఉన్న సుంకాలు కాని సమస్యలను పరిష్కరించడానికి కూడా భారతదేశం అంగీకరించింది.

సాంకేతిక నిబంధనల అమలును సులభతరం చేసే లక్ష్యంతో అమెరికా, భారత్ పరస్పరం అంగీకరించిన రంగాల్లో ప్రమాణాలు, అనుగుణ్యత అంచనా పద్ధతులపై (కన్ఫర్మిటీ అసెస్ మెంట్ ప్రొసీజర్స్) చర్చలు జరపాలని భావిస్తున్నాయి. అంగీకరించిన సుంకాలలో ఏవైనా మార్పులు జరిగితే దానికి అనుగుణంగా అవతలి దేశం కూడా తన నిబద్ధతలను మార్చుకోవచ్చని రెండు దేశాలు అంగీ కరించాయి.

బీటీఏ చర్చల ద్వారా మార్కెట్ అవకాశాలను మరింత విస్తృతం చేయడానికి రెండు దేశాలు కృషి చేస్తాయి. భారతీయ వస్తువులపై సుంకాలను మరింత తగ్గించాలన్న భారత్ విన్నపాన్ని బీటీఏ చర్చల సమయంలో పరిగణనలోకి తీసుకుంటామని అమెరికా తెలిపింది.

సరఫరా వ్యవస్థల పటిష్ఠత, ఆవిష్కరణలను పెంపొందించడానికి తృతీయ పక్షాల మార్కెటేతర విధానాలను ఎదుర్కోవడానికి, పెట్టుబడి సమీక్షలు- ఎగుమతి నియంత్రణలపై సహకరించుకోవడానికి రెండు దేశాలు ఆర్థిక భద్రతను బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాయి.

భారతదేశం రాబోయే 5 ఏళ్లలో అమెరికా నుంచి సుమారు 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధన ఉత్పత్తులు, విమానాలు - విమాన విడిభాగాలు, విలువైన లోహాలు, సాంకేతిక ఉత్పత్తులు, కోకింగ్ కోల్ కొనుగోలు చేయాలని భావిస్తోంది. గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూ), డేటా సెంటర్లలో ఉపయోగించే వస్తువులతో సహా సాంకేతిక ఉత్పత్తుల వాణిజ్యాన్ని రెండు దేశాలు గణనీయంగా పెంచు తాయి.. సంయుక్త సాంకేతిక సహకారాన్ని విస్తరిస్తాయి. డిజిటల్ వాణిజ్యానికి అడ్డంకిగా ఉన్న వివక్షతతో కూడిన లేదా భారంగా ఉన్న పద్ధతులను తొలగించడానికి అమెరికా, భారత్ కట్టుబడి ఉన్నాయి. బీటీఏలో భాగంగా పటిష్ఠమైన, పరస్పర ప్రయోజనకరమైన డిజిటల్ వాణిజ్య నిబంధనలను రూపొందించడానికి ఒక స్పష్టమైన మార్గాన్ని సిద్ధం చేస్తాయి.

ఈ ఫ్రేమ్‌వర్క్‌ను తక్షణమే అమెరికా, భారత్ అమలు చేస్తాయి. అలాగే 'నియమావళి'లో అంగీకరించిన రోడ్‌మ్యాప్‌కు అనుగుణంగా పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని (బీటీఏ) ముగించే లక్ష్యంతో ఈ మధ్యంతర ఒప్పందానికి తుది రూపు ఇచ్చేందుకు కృషి చేస్తాయి.

# ప్రజాస్వామ్య, ప్రగతిశీలత అభ్యుదయ విప్లవ సంస్థలను ఎన్నుకొండి

**-సీపీఐ ( ఎమ్ ఎల్) సీపీ రెడ్డి పార్టీ జాతీయ అధికార ప్రతినిధి బుద్ద సత్యనారాయణ పిలుపు**

సూర్యాపేట ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో నగరపాలక సంస్థ లకు జరుగుతున్న ఎన్నికలో బీజేపీ, కాంగ్రెస్, తెరాస,తదితర పార్టీలను బహిష్కరించి వాటి స్థానంలో అభ్యుదయ,ప్రగతి శిలా, పార్టీలను ,సంస్థలను ఎన్నుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు,బీజేపీ, కాంగ్రెస్,తెరాస, వైసీపీ,టీడీపీ,అందరూ దొంగలే నాని అన్నారు, ఈ పార్టీల ప్రతినిధులు ముఖ్య మంత్రులు, మంత్రులు,బీజేపీ కి కీలుబొమ్మలని,బీజేపీ పార్టీ,ప్రపంచ బ్యాంక్,విదేశీ సామ్రాజ్య వాద కార్పొరేట్ సంస్థల ఏజెంట్ అని వీరందరూ ,ప్రజా, దేశ, వెతురేకులని మండి పడ్డారు రాజ్యాంగంలో రాసుకున్న మౌలిక హక్కులైన కుడు గూడు విద్య వైద్యం ఉపాధి అవకా శాలు కల్పించలేని ప్రభుత్వాలు , ప్రజా లకు ఏమి చేసింది లేక ,పైగా తమ స్వార్థం కోసం కులం, మతం, మందిరం, అంటూ ప్రజలను విడదీసి రాజకీయాలు చేస్తున్నారు, దంకరణ్యం నుండి, మద్యబరతం నుండి ఆదివాసీ ప్రజలను,మావోయిస్ట పేర్లతో వేలాది మందిని చంపూ తూ అడివిలో ఉన్న అపారమైన ఖనిజ,ని ధి,నిక్షాలను, కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు ,ఆదివాసీలను అడవుల నుండి తరిమేసి, వారిని కంది శికులు గా మార్చివేశారన్నారు ప్రజా హక్కులనం,ప్రజలను గౌరవిం చని లాంటి బ్రాహ్మణీయ మనువాద, రాజకీయాలను తరిమి కొట్టాలని , ఈ సంద ర్భంగా అభ్యుదయ,విప్లవ, అంబేద్కర్ వాదులు, ప్రగతిశీ లూరు మేధావులు ఒక్కతాటిపై కల్సి రావాల్సిన అవుసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నేల 12 తేదీన మోడీ ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలను 4 లేబర్ కోడ్స్ లకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తం గా జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చెయ్యాలని ప్రజలకు పిలుపు నిచ్చారు

# ఇస్రో సందర్శనకు జూకల్ విద్యార్థుల ఎంపిక..



అమరావతి, ఫిబ్రవరి 7: జయశంకర్ జిల్లా చిట్యాల మండలంలోనిజూకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న 50 మంది విద్యార్థిని విద్యార్థులకు ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) సందర్శనకు అనుమతి లభించిందని పాఠశాల ప్రధానోపా ధ్యాయులు జి కృష్ణ శనివారం తెలిపారు . ఈ నెల 26వ తేదీన ఇస్రోను సందర్శించి, రాకెట్లను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం పొందడమే కాకుండా, ఇస్రో శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడే అరుదైన అవకాశం కూడా లభిం చిందన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని పురస్కరిం చుకొని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యార్థులను అభినందించారు. ఇస్రోను సందర్శించడం విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాలప్ర ధానో పాధ్యాయులు జి. కృష్ణ , ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థిని విద్యా ర్థులను ఆయన ప్రత్యేకంగా అభినం దించారు. జిల్లాలో అవకాశం ఉన్న మరిన్ని పాఠశా లలవిద్యా ర్థులు కూడా ఇస్రోను సందర్శించే విధం గా చర్యలు తీసుకోవాలని రాహుల్ శర్మ సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం ఓ విజయపాల్ రెడ్డి , పాఠశాలప్రధానోపాధ్యాయులు కృష్ణ , జిల్లా సైన్స్ఇ అధికారి బి. స్వామి , జి సి డి ఓ శైలజ , ప్లానింగ్ ఆఫీసర్ శ్రాజగోపాల్ ఉపాధ్యాయులు నాగవల్లి రూపశ్రీ, మారం స్వరూప, గాజర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ

**-డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**-హైటెక్స్‌లో ఘనంగా క్రెడాయ్ ప్రాపర్టీ షో -2026**




హైదరాబాద్, ఫిబ్రవరి 7: హైదరాబాద్ నగరం ప్రపంచంలోని అగ్ర నగరాలతో పోటీ పడుతున్నదిని, మహా నగరం చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడం ఓ చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన హైదరాబాద్ క్రెడాయ్ ప్రాపర్టీ షో 2026 కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు విచ్చేసి క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎన్.జైదీప్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎలెక్ట్ బి.జగన్నాథరావు, జనరల్ సెక్రటరీ క్రాంతి కిరణ్‌రెడ్డి, క్రెడాయ్ మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా భట్టి మాటాడుతూ .. హైదరాబాద్ మహానగరం ప్రపంచంలో మేటి నగరాలతో పోటీప డుతుందన్నారు.

హైదరాబాద్ అభివృద్ధికి రెండు సంవత్సరాల్లో రూ. 20వేల కోట్ల ను కేటాయించామని అన్నారు.

హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రోగ్రామ్ (హెచ్-సిఐటిఐ) కింద రూ. 7,032 కోట్లకు పైగా పెట్టుబడులతో 45 ప్రధాన ఫ్లై ఓవర్‌లు, అండర్ పాస్‌లు, 10 రోడ్డు విస్తరణ ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ పరిసరాల్లో రూ. 1090 కోట్లు వెచ్చించి వివిధ ప్రాజెక్టులు చేపడుతున్నామని తెలిపారు. పడమటి కారిడార్‌లో ఐఐటీ, ఖాజాగూడ వద్ద రూ. 837 కోటతో మల్టీ లెవల్ ఫ్లై ఓవర్లు, నాలెడ్జ్ ఎకానమికి తోడ్పడుతున్నాయని, రూ. 70 కోట్లతో వెస్ట్రన్ సిటీ ప్రధాన రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

ఉత్తర భాగంలో ఆర్మీ ఆర్డినెన్స్ సెంటర్ సమీపంలోని ప్రత్యామ్నాయ రహదారి నెట్‌వర్క్‌లు, ఏండ్ల నాటి ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు రూ. 960 కోట్లతో పనులను చేపట్టినట్లు తెలిపారు.

తూర్పు హైదరాబాద్‌లో టీకెఆర్ కళాశాల గాయత్రి నగర్, మండమల్లమ్మ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్‌ల కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు రూ. 416 కోట్లతో పనులను చేపడుతున్నట్లు తెలిపారు.

దక్షిణ భాగంలో వేగంగా విస్తరిస్తున్న పట్టణాభివృద్ధికి రోడ్లు విస్తరణ ప్రాజెక్టులకు రూ. 863 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 కింద క్యూర్-ప్యూర్-రేర్ వ్యూహం రాష్ట్ర అభివృద్ధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమిని కేంద్రంగా ఉంచనుం దన్నారు.

విశ్వాసం, పారదర్శకత, నైతిక పద్ధతులు, వినియో గదారుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే క్రెడాయ్ ప్రధాన సిద్ధాంతమైన క్రెడాయబిలిటీ ఆధారంగా ఈ ప్రాపర్టీ షో పర్మినెంట్ హో జావో అనే నేపథ్యంలో ముందుకు వచ్చినట్లు క్రెడాయ్ ప్రతినిధులు తెలిపారు.

# విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేలా సిలబస్‌లో మార్పులు : కేయూ వీసీ ప్రతాప్ రెడ్డి



హన్మకొండ, ఫిబ్రవరి 7: కాకతీయ విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధనల నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా పాఠ్యప్రణాళికలో విస్తృతమైన, సమకాలీన మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే ప్రతాప్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలోని సైన్స్ విభాగాధిపతులు, పాఠ్యప్రణాళిక కమిటీ అధ్యక్షుడు, సైన్స్ విభాగాల డీన్ జి.హనుమంతు సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా వీసీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేలా, సమాజ అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు తీసుకురావాలని సూచించారు. 2026- 27 విద్యా సంవత్సరం నుంచే ఈ మార్పులు అమలులోకి వచ్చే విధంగా ఒక నెల వ్యవధిలో పాఠ్య ప్రణాళికను పునఃసిద్ధం చేయాలని ఆయా విభాగాలను ఆదేశించారు. ప్రతి సబ్జెక్టుకు అనుగుణంగా భారతీయ జ్ఞాన వ్యవస్థ (ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్)కు సంబంధించిన అంశాలను పాఠ్య ప్రణాళికలో తప్పనిసరిగా చేర్చాలని సూచించారు.

భారతదేశానికి చెందిన సంప్రదాయ విజ్ఞానం, శాస్త్రీయ ఆలోచనలు, పరిశోధనా విధానాలు విద్యార్థులకు అవగాహన కలిగేలా ఈ అంశాలు ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా విలువాధారిత అదనపు కోర్సులు (వాల్యూ అడిషన్ కోర్సులు) ప్రతి విభాగంలో తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. సిలబస్ ను రూపొందించే సమయంలో పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, పరిశ్రమలు, ఇతర సంబంధిత వర్గాల (స్టేక్ హోల్డర్లు) అభిప్రాయాలు, సూచనలు కూడా తీసుకోవాలని సూచించారు.

అంతర్జాతీయ స్థాయిలో పోటీ సామర్థ్యాన్ని పెంచుతుందని.. ప్రస్తుత ప్రపంచ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలి జెన్స్) తోపాటు క్వాంటం సాంకేతికతల వంటి ఆధునిక, భవిష్యత్ ప్రాధాన్యత కలిగిన అంశాలను పాఠ్య ప్రణాళికలో పొందుపరచాలని ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఇది విద్యార్థుల్లో అంతరాజతీయ స్థాయిలో పోటీ సామర్థ్యాన్ని పెంచుతుందని, ప్రతి కోర్సుకు సంబంధించి కోర్సు ఫలితాలు, కార్యక్రమ ఫలితాలు, కార్యక్రమానికి ప్రత్యేకమైన ఫలితాలను (కోర్సు అవుట్ కమ్‌లు, ప్రోగ్రాం అవుట్ కమ్ లు, ప్రోగ్రాం స్పెసిఫిక్ అవుట్ కమ్‌లు) స్పష్టంగా పాఠ్యప్రణాళికలో పొందు పరచాలని ఆయా విభాగాల అధ్యయన మండలి సభ్యులు (బోర్డు ఆఫ్ స్టడీస్) ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. అదేవిధంగా కోర్సుల రూపకల్పనలో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశోధన దృక్పథం, ఉద్యోగావకాశాలు, సమకాలీన సమాజ సమస్యలకు పరిష్కారాలు సూచించే అంశాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠ్యప్రణాళిక విద్యార్థులను ఉద్యోగోన్ముఖులుగా, పరిశోధనాభిలాషులుగా తీర్చిదిద్దేలా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ సైన్సు విభాగాల విభాగాధి పతులు, పాఠ్యప్రణాళిక అధ్యక్షుడితోపాటు డీన్ ఆచార్య జి.హను మంతు, పరిక్షల నియంత్రణ అధికారి రాజేందర్, కాంపస్ కాలేజీ టి.మనోహర్, ఐ.క్యు. ఎ.సి. డైరెక్టర్ ఎస్.నరసింహచారి, బి.వెంకట్రామరెడ్డి, మామిడాల ఇస్తారి పాల్గొన్నారు.

# లంచం తీసుకున్న రక్షణ శాఖ అధికారులు..

**-రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సీబీఐ**

ముంబై, ఫిబ్రవరి 7: రక్షణ శాఖకు చెందిన ఇద్దరు అధికారులు రూ. 2 లక్షలు లంచం తీసుకున్నారు. ట్రాప్ చేసిన సీబీఐ రెడ్ హ్యాండెడ్‌గా వారిని పట్టుకున్నది. డిఫెన్స్ ఆఫీసర్స్ ఇళ్లల్లో సోదాలు చేసింది. ఈ వ్యవహారంలో ఇతర అధికారుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నది. మహారాష్ట్రలోని పూణేలో ఈ సంఘటన జరిగింది. ఖడ్కి లోని మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీ సెస్ (ఎంఈఎస్)కు సంబంధి ంచిన కాంట్రాక్ట్ పనులను ఒక ప్రైవేట్ కంపెనీ కాంట్రాక్టర్ పూర్తి చేశాడు.కాగా, ఎంఈఎస్‌కు చెందిన రక్షణ శాఖ అధికారులైన అసిస్టెంట్ గ్యారిసన్ ఇంజినీర్ సునీల్ నికం, జూనియర్ ఇంజినీర్ సురేష్ మష్కే బిల్లుల చెల్లింపు నిలిపివేసినట్లు ఆ కాంట్రాక్టర్ ఆరోపించాడు. డిఫెన్స్ అధికారులు రూ. 6 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కు ఫిర్యాదు చేశాడు.

మరోవైపు ఫిబ్రవరి 3న సీబీఐ కేసు నమోదు చేసింది. ఫిబ్రవరి 5న సీబీఐ అధికారులు ట్రాప్ వేశారు. జూనియర్ ఇంజినీర్ సురేష్ తన కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి తొలి విడతగా రూ. 2 లక్షలు లంచం తీసుకోగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఆ అధికారితో పాటు అసిస్టెంట్ గ్యారిసన్ ఇంజినీర్ సునీల్ నికంను కూడా సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. వారి నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేశారు. కొన్ని పత్రాలతో పాటు రూ. 1,8 8,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కాంట్రాక్ట్ పనుల బిల్లుల చెల్లింపు కోసం లంచం డిమాండ్ వ్యవహారంలో ఇతర అధికారుల ప్రమేయంపైనా సీబీఐ దర్యాప్తు చేస్తున్నది.

# భారత్, అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం ముసాయిదాను స్వాగతించిన ప్రధానమంత్రి..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: భారతదేశం, అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి కుదిరిన ముసాయిదాను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ స్వాగతించారు. ఈ పరిణామం ఇరుదేశాలకు గొప్ప శుభవార్త అన్నారు.

భారత్-అమెరికా సంబంధాలను బలోపేతం చేయడంలో డొనాల్డ్ ట్రంప్ చూపిన వ్యక్తిగత నిబద్ధతకు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యాచరణ ఇరుదేశాల భాగస్వా మ్యంలో పెరుగుతున్న సాన్నిహిత్యం, విశ్వాసం, శక్తిమంతమైన మార్పుని ప్రతిబింబిస్తోందన్నారు.

ఈ ఒప్పందం రైతులకు, పారిశ్రామికవేత్తలకు, ఎంఎస ఎంఈలు, స్టార్టప్ ఆవిష్కర్తలకు, మత్స్యకారులకు నూతన అవకాశాలను కల్పించటంతో 'మేక్ ఇన్ ఇండియా' బలోపేతం అవటమే కాక, మహిళలకు, యువతకు పెద్దఎత్తున ఉపాధి లభిస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

పెట్టుబడులను, సాంకేతిక భాగస్వామ్యాలను ఈ కార్యాచరణ మరింత బలోపేతం చేస్తుందని.. స్థిరత్వం, విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలను పటిష్ఠం చేస్తుందని, అలాగే ప్రపంచ వృద్ధికి దోహదపడుతుందని ఆయన చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యంగా భారతదేశ ఆకాంక్షను ప్రధానమంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రజల సాధికారతకు, సామూహిక వృద్ధికి తోడ్పడే ప్రపంచ భాగస్వామ్యాలకు భారత్ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.

భారత్, అమెరికా మధ్య కుదిరిన తాత్కాలిక ఒప్పందానికి సంబంధించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన పోస్టుకు స్పందిస్తూ, శ్రీ నరేంద్ర మోదీ ఇలా పేర్కొన్నారు;రెండు దేశాల మధ్య తాత్కాలి క వాణిజ్య ఒప్పందానికి రూపొం దించిన ముసాయిదాపై మేం ఏకాభిప్రాయానికి వచ్చాం. మన దేశాల మధ్య పటిష్ఠమైన సంబ ంధాల కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చూపిన వ్యక్తిగత నిబద్ధతకు ధన్యవాదాలు.

ఈ కార్యాచరణ ఇరు దేశాల భాగస్వామ్యంలో పెరుగుతున్న సాన్నిహిత్యం, విశ్వాసం, శక్తిమంతమైన మార్పుని ప్రతిబిం బిస్తోంది. దీని ద్వారా రైతులకు, పారిశ్రామికవేత్తలకు, ఎంఎస్ ఎంఈలు, స్టార్టప్ ఆవిష్కర్తలకు, మత్స్యకారులకు నూతన అవకాశాలు ఏర్పడటం వల్ల 'మేక్ ఇన్ ఇండియా' బలోపేతం అవుతుంది. మహిళలకు, యువతకు పెద్దఎత్తున ఉపాధి లభిస్తుంది.

భారత్, అమెరికా దేశాలు ఆవిష్కరణలను ప్రోత్స హిం చేందుకు ప్రాధాన్యతనిస్తున్నాయి. ఈ కార్యాచరణ మన మధ్య పెట్టుబడులను, సాంకేతిక భాగ స్వామ్యాలను మరింత బలోపే తం చేస్తుంది. ఈ ముసాయిదా ద్వారా స్థిరత్వం, విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలు పటిష్ఠమవటమే కాక, ప్రపంచ వృద్ధికి దోహ దపడు తుంది. వికసిత్ భారత్ లక్ష్యంగా భారతదేశం అడుగులు వేస్తున్న తరుణంలో భవిష్యత్ అవసరా లకు అనుగుణంగా ప్రజల సాధికారతకు, సామూహిక వృద్ధికి తోడ్పడే ప్రపంచ భాగస్వామ్యాల నిర్మాణానికి వేం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాం.

# ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చింది.. వాటిలో ఒక్క హామీనైనా నెరవేర్చిందా?

## –కాంగ్రెసోళ్లు బంగారం ఇచ్చేవాళ్లు కాదు.. మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లే బ్యాచ్

## – బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కామారెడ్డి ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కాంగ్రెసోళ్లు బంగారం ఇచ్చేవాళ్లు కాదు.. మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లే బ్యాచ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు దండుపాళ్యం బ్యాచ్.. స్టువర్టుపురం దొంగలని ఎద్దేవా చేశారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ముందుగా కొయ్యగుట్టలో అమరవీరుల స్థూపం వద్ద కేటీఆర్ నివాళు లర్పించారు. కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆయన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మోసాలను ఎండ గట్టారు.న్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందని.. వాటిలో ఒక్క హామీనైనా నెరవేర్చిందా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో తులం బంగారం లేదు.. స్కూటీలు లేవు.. ఆరు గ్యారెంటీలు లేవని విమర్శించారు. రైతుబంధు లేదు.. రైతు భరోసా లేదని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. అసలు కాంగ్రెస్ చెప్పిన నాలుగు వేల పెన్షన్ ఎవరికైనా వస్తుందా అని ప్రశ్నించారు. ఫ్రీ బస్సు పేరుతో రేవంత్ రెడ్డి మహిళలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మనిషి కాదు అని అన్నారు. మోదీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ తోడు దొంగలని ఆరోపించారు. రేవంత్, ప్రధాని మోదీ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషే, ఆయన కప్పుకున్న ముసుగు తొలగించి చూడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలను కోరారు. రేవంత్ ఏనాటికీ కాంగ్రెస్ మనిషి కాలేదని, ఆయన ముందు నుంచి బీజేపీ మనిషి అని, రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడు అని కేటీఆర్ అన్నారు. అందుకే రాష్ట్రంలోని మైనారిటీలు, మత రాజకీయాలను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి కప్పుకున్న బీజేపీ ముసుగును తొలగించి చూడాలని, ఆయన లోపల ఉన్న బీజేపీ నాయకుడిని గుర్తించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నాం కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో మాకు ఓటు వేయాలని కాంగ్రెస్ చెప్తున్న వాదన అర్థరహితమన్నారు. అధికారంలో ఉండి గత రెండు సంవత్సరాల్లో ఏం చేశారో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పాలన్నారు. ఒకవేళ రానున్న రెండు సంవత్సరాల పాటు అధికారంలో ఉంటే.. ఆ తరువాత మా ప్రభుత్వం వస్తుందని, అప్పుడు ఖచ్చితంగా పట్టణాలను కాంగ్రెస్ కంటే గొప్పగా గతంలో మాదిరి అభివృద్ధి చేస్తామని కేటీఆర్ అన్నారు. మైనారిటీలకు, బీసీలకు భారీ ఎత్తున బడ్జెట్ ఇస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఖచ్చితంగా ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలైతే కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలు పొందిన వాళ్లు మాత్రమే ఆ పార్టీకి ఓటు వేయాలని, మిగిలిన వాళ్లు ఆ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రూ. 4000 పెన్షన్, రూ. 2500 రూపాయలు మహిళలకు, మరోవైపు విద్యా భరోసా కార్డు గానీ, రైతు భరోసా గానీ, కళ్యాణ లక్ష్మి, తులం బంగారం వచ్చిన వాళ్లు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. కానీ ఇవేవీ ఇవ్వకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎందుకు పోయారో బాన్సువాడ ప్రజలకు సమాధానం చెప్పవలసిన అవసరం ఉందని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# జగిత్యాల జిల్లాలో దారుణం..భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

హైదరాబాద్, ఫిబ్రవరి 7: జగిత్యాల జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. కట్టుకున్న భారను భర్త దారుణంగా హతమార్చాడు. ఈ విషాదకర సంఘటన జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మల్లయ్య, సత్తవ్వ దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం సత్తవ్వను మల్లయ్య గొడ్డలితో నరికి చంపి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బెల్లంపల్లి ప్రభుత్వ ఎస్సీ బాలికల గురుకుల స్కూల్‌లో ఫుడ్ పాయిజన్

### –40 మంది విద్యార్థినులకు తీవ్ర అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు

మంచిర్యాల ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి ప్రభుత్వ ఎస్సీ బాలికల గురుకుల స్కూల్‌లో ఫుడ్ పాయిజన్ అయింది. నిన్న రాత్రి కలుషిత ఆహారం తిన్న విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. అస్వస్థతకు లోనైన 40 మంది విద్యార్థినులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరామర్శించారు.కాగా ఫుడ్ పాయిజన్ ఘటనకు సంబంధించి షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రాత్రి 7:30 గంటలకు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని ఫోన్ చేసిన తెలుపగా.. హాస్టల్ వార్డెన్ రాత్రి 10 గంటలకు హాస్టల్ వద్దకు వెళ్లడం గమనార్హం. అన్నంలో పురుగులు వచ్చాయని తెలిపినా పడేయకుండా అలాగే తినాలని హాస్టల్ వార్డెన్ విద్యార్థినులకు చెప్పినట్టు సమాచారం. ఫుడ్ పాయిజన్ అయిన విషయం బయటకు వస్తే పరువు పోతుందని హాస్టల్ వార్డెన్ విద్యార్థినులకు ఆర్ఎంపీ డాక్టర్‌తో చికిత్స చేయించాడు.108కి కాల్ చేయమని విద్యార్థినులు ఎంత వేడుకున్నా హాస్టల్ సిబ్బంది వారిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా అక్కడే చూస్తూ కూర్చున్నారు. హాస్టల్ వార్డెన్ వచ్చే వరకు మూడు గంటలపాటు నరకం అనుభవించామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు.

# రష్యాతో ఆయిల్ కొనుగోళ్లు తగ్గించిన ఇండియా.. టారిఫ్‌లు తగ్గించిన ట్రంప్



న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);భారత్‌పై విధించిన సుంకాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తగ్గించారు. ఈ మేరకు టారిఫ్‌లు తగ్గిస్తూ ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయం శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోమని ఇండియా హామీ ఇచ్చిన నేపథ్యంలో టారిఫ్‌ల తగ్గింపు నిర్ణయాన్ని అమెరికా అమలు చేస్తోంది. రష్యా నుంచి నేరుగా కానీ, లేదా పరోక్షంగా కానీ చమురు కొనబోమని ఇండియా హామీ ఇచ్చిందని ట్రంప్ ప్రకటించాడు.ఇటీవలి కాలంలో ఇండియా.. రష్యా నుంచి చమురు కొనుగోలు తగ్గించినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు అమెరికా నుంచి చమురు సహా ఎనర్జీ సంబంధిత ఉత్పత్తులు కొనుగోలు చేస్తామని కూడా ఇండియా హామీ ఇచ్చింది. కొత్త టారిఫ్‌లు అమలు లోకి రావడంతో ఇకపై ఇరు దేశాల మధ్య ఉత్పత్తులపై 18 శాతం మత్రమే పన్నులు ఉంటాయి. ఇది దేశీయ ఎగుమతి దారులకు, తయారీ దారులకు మేలు చేస్తుందని భారత్ భావిస్తోంది. అమెరికా నుంచి ఇండియా 500 బిలియన్ డాలర్ల ఉత్పత్తుల్ని దిగుమతి చేసుకోనుంది. అలాగే భారత ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ అందుబాటులోకి వస్తుంది. ఇది చరిత్రాత్మక విజయం అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. మరోవైపు తాజాగా ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందం అమలులోకి రావడంపై ప్రధాని మోదీ స్పందించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు.ఇది ఇరు దేశాలకు మంచి శుభవార్త అని, రెండు దేశాల మధ్య బలమైన సంబంధాల కోసం వ్యక్తిగత నిబద్ధతతో కృషి చేసిన ట్రంప్‌నకు థాంక్స్ అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ డీల్ ఇండియాలోని రైతులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, మత్స్యకారులకు కొత్త అవకాశాల్ని సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు. మేకిన్ ఇండియా లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని, మహిళలు, యువతకు భారీ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మోదీ అభివర్ణించారు.

# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో కేంద్రమంత్రి, ఏపీ బీజేపీ చీఫ్ ముఖాముఖి




విజయవాడ, ఫిబ్రవరి 7: భారతదేశాన్ని 2047 నాటికి 'అభివృద్ధి చెందిన దేశం'గా మార్చడమే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ 2026 రూపొందించబడిందని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఇవాళ (శనివారం) ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో జరిగిన 'వికసిత్ భారత్ బడ్జెట్ 2026' ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో జరిగిన ఈ చర్చా కార్యక్రమంలో బడ్జెట్ విశేషాలను, ఏపీ అభివృద్ధికి కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యతను ఈ సందర్భంగా కేంద్రమంత్రి వివరించారు.

ఈ సందర్భంగా ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ, దేశంలోనే మొట్టమొదటి 'క్వాంటమ్ టెక్నాలజీస్ హబ్' అమరావతిలో ఏర్పాటు కావడం ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఇది రాష్ట్ర సాంకేతిక ముఖచిత్రాన్ని మార్చివేయడమే కాకుండా, భవిష్యత్ పరిశోధనలకు వేదికగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

భారతదేశాన్ని గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చే క్రమంలో కేంద్రం భారీ అడుగులు వేస్తోందని ఇరువురు నేతలు తెలిపారు. దేశవ్యాప్తంగా సెమీకండక్టర్ హబ్‌ల నిర్మాణం కోసం రూ.40,000 కోట్లను కేటాయించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో సౌత్ కొరియన్ కంపెనీలు ఇప్పటికే రూ.749 కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం శుభపరిణామమని కేంద్రమంత్రి అన్నారు. 'వికసిత భారత్' కల సాకారం కావాలంటే 'వికసిత ఆంధ్రప్రదేశ్' నిర్మాణం కూడా అంతే ముఖ్యమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

ప్రభుత్వ పథకాలు, బడ్జెట్ ప్రయోజనాలను ప్రజలకు నేరుగా చేరవేయడంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మీడియా కంటే వేగంగా సమాచారాన్ని సామాన్యుడికి చేరవేసే శక్తి వారికి ఉందని, అందుకే ఇలాంటి 'అవుట్ రీచ్' ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని మాధవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సోషల్ మీడియా ప్రముఖులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి, ఏపీ బీజేపీ చీఫ్ సమాధానాలు ఇచ్చారు.

# అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన

అమరావతి, ఫిబ్రవరి 7: ఏపీ రాజధాని అమరావతి.. ప్రపంచస్థాయి క్వాంటమ్ టెక్నాలజీ కేంద్రంగా రూపుదిద్దుకునే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిత్రాత్మక ముందడుగు వేశారు. శనివారం తుళ్లూరు మండలం ఉద్ధండరాయుని పాలెంలో 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి పునాది రాయి పడింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచ క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' ప్రాజెక్ట్ రాష్ట్రానికి, దేశానికి మైలురాయిగా నిలవనుంది. భారతదేశంలోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌కు అమరావతి వేదిక కానుంది.

క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు, ఉత్పత్తులు, నైపుణ్యాభివృద్ధికి ఇక్కడ విస్తృత అవకాశాలు ఉంటాయి. ప్రపంచంలోనే అత్యాధునిక క్వాంటమ్ హబ్‌ల సరసన అమరావతిని నిలబెట్టాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ వ్యాలీ ఏర్పాటుతో ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలు, గ్లోబల్ టెక్ సంస్థల పెట్టుబడులు, స్టార్టప్ ఎకోసిస్టమ్ విస్తరణ, లక్షలాది మంది యువతకు అధునాతన నైపుణ్య శిక్షణ అందుబాటులోకి వస్తాయి. ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తిచేసి, డిసెంబర్‌లోపు క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

క్వాంటమ్ టెక్నాలజీ ద్వారా సామాన్యుడి జీవితంలో గణనీయమైన మార్పులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. దీంతో ఫార్మా రంగంలో పరిశోధనలు వేగవంతం కానున్నాయి. వ్యవసాయంలో వాతావరణ అంచనాలు, నీటి వినియోగం, దిగుబడి అంచనాలు కచ్చితంగా ఉండటం, బ్యాంకింగ్ డిజిటల్ లావాదేవీల భద్రత పెరగడం వంటి అనేక ప్రయోజనాలు లభించనున్నాయి. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచంలోని బోస్టన్, సింగపూర్, షాంఘై వంటి క్వాంటమ్ కేంద్రాలతో సమానంగా నిలవనుంది. భవిష్యత్తులో అమరావతి.. క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకి ప్రపంచ కేంద్రంగా మారనుందని ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేశాయి. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

క్వాంటమ్ వ్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహా ఏపీ మంత్రులు నారా లోకేశ్, నారాయణ, కందుల దుర్గేశ్, తాడికొండ ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీ మాత్రమే ఎందుకు ?

## – పుస్తకాన్ని ఆవిష్కరించిన లోక్ సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి



హైద్రాబాద్ ఫిబ్రవరి 7(ఎక్స్ ప్రెస్ న్యూస్) 140 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగి ,భారతదేశాన్ని 60 సంవత్సరాలు పరిపాలించి , ప్రపంచంలో అగ్రరాజ్యంగా మలిచిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తన 22 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ పోరాటంలో ఎన్నో అవమానాలు భరించి కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా 5000 కిలోమీటర్లు పాదయాత్ర చేసి భారత్ జోడోయాత్ర నిర్వహించిన యువనేత రాహుల్ గాంధీ భారత భావి ప్రధానిగా కావాలని ,ఆయన పై వచ్చే దుష్ప్రచారాన్ని ఖండిస్తూ మంచి పుస్తకం వ్రాసి,దేశవ్యాప్తంగా వేలాది పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తు,విస్తృత ప్రచారం చేస్తున్న పుస్తక రచయిత రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఆళ్ల రామకృష్ణ మిక్కిలి అభినందనీయుడని ,భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీ భారతదేశానికి స్వర్ణయుగం సృష్టిస్తారని డాక్టర్ మల్లు రవి ఆశాభావం వ్యక్తంచేస్తు ,ఈ పుస్తక ఆవిష్కరణ తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని చెప్పారు.ఈ సందర్భంగా కరెన్సీ పై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డా జేరిపోతుల పరశురామ్ పాల్గొన్నారు

# దేవరకొండ ఖిల్లా మీద మరోసారి గులాబీ జెండా ఎగరవేయాలి : మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

నల్గొండ, ఫిబ్రవరి 7: గత బీఆర్ఎస్ హయాంలోనే దేవరకొండ అభివృద్ధి చెందిందని నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా శనివారం దేవరకొండ పట్టణంలోని 12 ,14 ,13,18,19 వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని దేవరకొండ అభివృద్ధి చెందిందని అన్నారు.

దేవరకొండలో ప్రతి వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ, పైపులైన్ పనులు జరిగాయని అన్నారు. అందుకని ఈ నెల 11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అయినప్పటికీ ఏ ఒక్క హామీ అమలు కాలేదని అన్నారు. ఓటు వేసే సమయంలో ఒకసారి ఆలోచించి మనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఓటర్లను కోరారు.

బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు గెలుపు కోసం ప్రతీ ఒక కార్యకర్త పనిచేయాలని అన్నారు. దేవరకొండ ఖిల్లా మీద మరోసారి గులాబీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కేతావత్ భిల్యా నాయక్, రమేష్ నాయక్, కిషన్ నాయక్, ఆంజనేయులు, హరి నాయక్, మంజు నాయక్, రూపాల నాయక్, రవి కుమార్, భవానీ, బాబా, అంజి గౌడ్ రాజు, కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, శంకర్ నాయక్, లోక్య నాయక్ ఉన్నారు.

# సంగారెడ్డి పట్టణాన్ని అభివృద్ధి చేస్తా

## సంగారెడ్డి మున్సిపాలిటీలోని 38 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోండి..



సంగా రెడ్డి ఫిబ్రవరి 7 ( ఎక్స్ ప్రెస్ న్యూస్)సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి వార్డుకు రూ. 8 కోట్ల చొప్పున రూ. 300 కోట్లతో సంగారెడ్డి పట్టణాన్ని అభివృద్ధి చేస్తా నని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాగ్గా రెడ్డి జగ్గా రెడ్డి తెలిపారు.మునిసిపల్ ఎన్నికలలో భాగంగా శనివారం ప్రచారం లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనేను ఎమ్మెల్యేగా లేకున్నా మీ పనులు చేయిస్తున్నాను.. ఇక ముందు కూడా చేపిస్తానన్నారు.5500 మందికి గతంలో ఇళ్ల స్థలాలు సర్టిఫికెట్లు ఇచ్చిన.. స్థలాలు లేని వారికి కూడా 80 గజాల చొప్పున ఇప్పిస్తాననిఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోనూ మాట్లాడిన నన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి పథకాలన్నీ అమలు చేస్తున్నారు15 వేల మంది సంగారెడ్డి పట్టణ ప్రజలతో జగ్గారెడ్డి ముఖాముఖి సభ నిర్వహించారు.ఈ సందర్భంగాజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ బస్సులో మహిళలు ప్రయాణం చేస్తున్నారు60 సీట్లు ఉన్న బస్సులో 100 మంది మహిళలు ఎక్కితే గొడవలు కావా..అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు దీన్ని కావాలని రాద్ధాంతం చేస్తున్నాయి.ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి బియ్యం తక్కువ ఉన్నా తినేవాళ్ళు ఎక్కువగా ఉన్నట్టు ఉంది.ఆర్థిక పరిస్థితి బాగలేకున్నా మెల్లమెల్లగా అన్ని పథకాలు అమలు చేస్తున్నా మన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ, ఇందిరమ్మ ఇండ్లు ఇలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాంసంగారెడ్డి మున్సిపాలిటీలో 38 వార్డుల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండిగెలిచిన కాంగ్రెస్ కౌన్సిలర్ల వార్డు ల్లో సీఎం రేవంత్ తో మాట్లాడి అన్ని పనులు చేయిస్తా ని హామీ ఇచ్చారు.

ఒక్కో వార్డు కు 8 కోట్ల రూపాయలు మంజూరు చేయిస్తాజగ్గారెడ్డి మాటంటే మాటేసంగారెడ్డిలో అన్ని వార్డులు గెలిస్తే 300 కోట్లు తీసుకు వస్తా 2013లో 5500 మందికి ఇంటి స్థలాలు ఇచ్చాను కానీ పదేళ్లు ప్రభుత్వం పొజిషన్ ఇవ్వలేదు నేను ఇప్పుడు ఎమ్మెల్యేగా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది 5500 మందితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి స్థలాలు ఇప్పిస్తాఎమ్మెల్యేగా లేకున్నా సంగారెడ్డి ప్రజలకు పనులు చేపి స్తానా భార్య నిర్మలా సంగారెడ్డిలో పర్యటిస్తుందినిర్మల సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తుంది నేను తెలంగాణ మొత్తం తిరుగు తామీకు రోజు పాలిచ్చే ఆవు కావాలా.. ఐదేళ్లకోసారి పాలిచ్చే ఆవు కావాలా.. మీరే తేల్చుకోండి అప్పుడప్పుడు ఆవుకు మేత దొరక్కపోతే పాలివ్వదు.

నేను కూడా అంతే నా దగ్గర మేత లేకపోతే పాలు ఇవ్వను ఈ మున్సిపల్ ఎన్నికలు అత్త కోడళ్ల తీరు ఉందితాళం అత్తకి ఇచ్చి కోడలిని వంట చేయమంటే ఎలా చేస్తుందిసంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో వేరే పార్టీ అభ్యర్థులను గెలిపించి నన్ను పనులు చేయమంటే ఎలా చేస్తానేను సదాశివపేటలో మహిళకు లక్ష రూపాయలు సహాయం చేస్తే నాపై ఎన్నికల కమిషన్ కి బీజేపీ, బిఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారునేను రోజు పాలిచ్చే అవును కాబట్టి అలానే చేస్తా నన్నారు.

# కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

## -జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ మహిళా ఉపాధ్యక్షురాలు గద్దాస్ శైలజ డిమాండ్.

హైద్రాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్) : కేంద్ర స్థాయిలో ఓబీసీ సంక్షేమాన్ని చూసేందుకు బీసీ ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ మహిళా ఉపాధ్యక్షురాలు గద్దాస్ శైలజ డిమాండ్ చేశారు. శనివారం మీడియా సమావేశం లో దేశంలో బీసీలు 56 శాతం ఉన్నారని, వారి ఆలనా పాలన చూసే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎసీ మైనార్టీ, మహిళలు వంటి వారికి మంత్రిత్వశాఖలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. వెంటనే బిసి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కోరారు. 56 శాతం జనాభా ఉన్న బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం బాధకరమని ఆయన వివరించారు. బిసిలకు ఉపాధి, విద్యలో 27 శాతం అమలు చేస్తున్నారని, జాతీయ బిసి కమిషన్ కార్పోరేషన్లు కూడా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. గత 15 సంవత్సరాల క్రితం బిసి పార్లమెంటరీ కమిటీ కూడా ఏర్పాటు చేశారని, బిసి రిజర్వేషన్లు, ఇతర సమస్యలు ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం బిసి ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయడం అత్యవసరమని శైలజ తెలిపారు.ఈకార్యక్రమం లో బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామంజనేలు, రాజేందర్, నికిల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com